# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 35 | విశాఖపట్నం | 5-11-2025 బుధవారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 35 | VISAKHAPATNAM | 5-11-2025 WEDNESDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



**రిపోర్టర్లు కావలెను**

పతాకం న్యూస్ PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934


## మొంథా తుపాను బాధిత రైతులందరికీ

# పంట బీమా వర్తింపజేయాలి: జగన్



**కృష్ణా జిల్లా, పతాకం న్యూస్:** టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, మొంథా తుపాను కారణంగా నష్టపోయిన రైతులందరికీ తక్షణమే పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని వైసీపీ అధినేత జగన్ డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ఈ పథకం ద్వారానే ఉపశమనం లభిస్తుందని ఆయన అన్నారు. మంగళవారం కృష్ణా జిల్లాలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన జగన్, పంట నష్టపోయిన రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మొంథా తుపాను వల్ల 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, కేవలం వరి పంటే 11 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారం ఎగ్గొట్టేందుకే ప్రభుత్వం పంట నష్టం అంచనాలను తూతూమంత్రంగా చేపట్టిందని ఆరోపించారు. ఒక్క రోజులోనే లెక్కింపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని, కానీ క్షేత్రస్థాయిలో ఏ అధికారి పర్యటించలేదని 25 జిల్లాల రైతులు ముక్తకంఠంతో చెబుతున్నారని అన్నారు. పంటల బీమాను రద్దు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద తప్పు చేశారని, దాని ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జగన్ విమర్శించారు. బీమా ప్రీమియం చెల్లించకపోవడం ప్రభుత్వ తప్పిదమే కాబట్టి, బకాయిపడ్డ రూ.600 కోట్లను ప్రభుత్వమే చెల్లించి, రాబోయే రబీ సీజన్‌కు కూడా ప్రీమియం కట్టాలని డిమాండ్ చేశారు. ఈ 18 నెలల సంకీర్ణ ప్రభుత్వ పాలనలో 16 సార్లు తుపానులు, కరవు వంటి విపత్తులు వచ్చినా రైతులకు అండగా నిలవలేదని మండిపడ్డారు. "రైతులు తీవ్ర కష్టాల్లో ఉంటే, చంద్రబాబు ఏరియల్ సర్వే చేసి లండన్ వెళతారు... ఆయన కుమారుడు లోకేశ్ ఏమో ముంబైలో క్రికెట్ మ్యాచ్ చూస్తారు.... రైతులను గాలికి వదిలేశారు" అని జగన్ తీవ్రస్థాయిలో విమర్శించారు.

రెండేళ్లుగా ఇస్తానన్న రూ.20,000 ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా కేవలం రూ.5,000 ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపిం చారు. తమ ప్రభుత్వ హయాంలో ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమాను సకాలంలో అందించామని గుర్తుచేశారు. "మేము అధికారంలో ఉన్నప్పుడు 85 లక్షల మంది రైతులకు ప్రీమియం చెల్లించాం. రూ.3,000 కోట్ల ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర కల్పించాం. మొత్తం రూ.78,000 కోట్లు రైతుల కోసం ఖర్చు చేశాం. కానీ, ఈ ప్రభుత్వం కేవలం బ్యాంకు రుణాలు తీసుకున్న 19 లక్షల మందికి మాత్రమే బీమా వర్తింపజేసి మిగతా వారిని వదిలేసింది" అని జగన్ వివరించారు.

## రహదారుల నాణ్యతలో

# రాజీపడబోం: పవన్



**అమరావతి, పతాకం న్యూస్:** 'సాస్కి' పథకం ద్వారా నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. ప్రజలకు 'సాస్కి' నిధుల ఫలాలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులకి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు డిప్యూటీ సీఎం. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులకు రూ.2 వేల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూర్చిందని స్పష్టం చేశారు పవన్ కల్యాణ్. సాస్కి నిధులతో నిర్మించే రోడ్లలో ఎక్కడ నాణ్యతా ప్రమాణాలు తగ్గకూడదని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో బాధ్యత అధికార యంత్రాంగానిదేనని ఆజ్ఞాపించారు. రోడ్ల నిర్మాణ దశ నుంచి పూర్తయ్యే వరకూ అధికారులు పరిశీలించాలని హుకుం జారీ చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకంలో మరో ముందడుగు వేశామని ఉద్ఘాటించారు పవన్ కల్యాణ్. ఏపీలోని గ్రామాల్లో రహదారుల స్థితిగతులను మార్చి నూతన రోడ్లు నిర్మించడానికి కేంద్రప్రభుత్వం 'సాస్కి' పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు రూ. 2 వేల కోట్లు నిధులు సమకూర్చిందని వ్యాఖ్యానించారు. ఈ నిధులతో ప్రజలకు పటిష్టమైన రహదారులు అందించే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్లను పునర్నిర్మించే కార్యక్రమం చేపడుతున్నామని పవన్ తెలిపారు. (తరువాయి 2వ పేజీలో)

## ఛత్తీస్‌ఘఢ్‌లో రెండు రైళ్లు ఢీ..

# ఆరుగురు మృతి



**ఛత్తీస్‌ఘఢ్, పతాకం న్యూస్:** ఛత్తీస్‌ఘఢ్‌లో ఎదురెదురుగా వస్తున్న రెండు రైళ్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆరుగురు మరణించగా, పలువురికి గాయాలైనట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముం దని అన్నారు. బిలాస్‌పూర్‌లో జైరామ్ నగర్ స్టేషన్ సమీపంలో ప్రమాదం జరి గింది. గూడ్స్‌ట్రైన్‌ను కోర్బా ప్యాసింజర్ రైలు ఢ కొట్టింది. ఘటనా స్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## పోలీసుశాఖకు మౌలిక సదుపాయాలు

# కల్పిస్తాం: అనిత



**గుంటూరు, పతాకం న్యూస్:** పోలీసు శాఖకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. పోలీసు శాఖ సమర్ధవంతంగా పని చేయాలంటే సదుపాయాల కల్పన అవసరమన్నారు. రాజధాని లోని వెలగపూడిలో డిఎస్పి కార్యాలయాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2014-19 లో టిడిపి ప్రభుత్వం హయాంలో ఎకరం స్థలంలో డిఎస్‌పి కార్యాలయం నిర్మాణానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణం సంగతి పట్టించు కోలేదన్నారు. పోలీసుల ఆరోగ్యం, భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందని చెప్పారు. రాజధానిలో ఎస్పి క్యాంపు కార్యాలయం ఏర్పా టుతో పాటు సిబ్బంది సంఖ్యను పెంచుతామని చెప్పారు. 6,100 మంది పోలీసులను రిక్రూట్‌మెంట్ ద్వారా తీసుకున్నామన్నారు.

## టీడీపీ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై వివరణ ఇచ్చిన

# ఎమ్మెల్యే కొలికపూడి



**అమరావతి, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మధ్య చెలరేగిన వివాదం క్రమశిక్షణ కమిటీ ముందుకు చేరింది. పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు నేడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో క్రమశిక్షణ కమిటీ విచారణ చేపట్టింది. ఈ విచారణకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హాజరై, సుమారు నాలుగు గంటల పాటు కమిటీ సభ్యులకు తన వాదనను లిఖితపూర్వకంగా వివరించారు. అనంతరం ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత ఎంపీ కేశినేని చిన్ని కూడా కమిటీ ముందు హాజరై వివరణ ఇవ్వనున్నారు. గత ఎన్నికల్లో తిరువూరు ఎమ్మెల్యే టికెట్ కోసం (తరువాయి 3వ పేజీలో)

# 70వ ప్రజా దర్బార్... 4 వేల మందిని కలిసిన లోకేశ్



**మంగళగిరి, పతాకం న్యూస్:** రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమం 70వ రోజుకు చేరుకుంది. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం మరోసారి జనసంద్రంగా మారింది. మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు. సుమారు నాలుగు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ దాదాపు 4 వేల మందికి పైగా ప్రజలను స్వయంగా కలిసి వారి సమస్యలను ఓపికగా విన్నారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్య తీవ్రతను బట్టి అక్కడికక్కడే అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించే బాధ్యత తమదని, అందరికీ అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన వారిలో అధికశాతం మంది గత వైసీపీ ప్రభుత్వంలో తాము ఎదుర్కొన్న కష్టాలను, అన్యాయాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వంలో తమపై అక్రమ కేసులు బనాయించారని, ఆస్తులు లాక్కున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నేతల ప్రోద్బలంతో తన భూమిని బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని శ్రీకాకుళం (తరువాయి 4వ పేజీలో)


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## ఉపాధి ఏదీ?

దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా వివిధ సంస్థల నుంచి భారీ పెట్టుబడులు ఏపీకికి వస్తున్నాయని ముఖ్యమంత్రి ప్రకటించడం ఆనందదాయకమైన విషయం. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి చెందబోతున్నదని ప్రచార మాధ్యమాలలో కూడా మారుమోగుతోంది. గడిచిన పదేళ్లలో గత తెలుగుదేశం, వైసిపి, నేటి కూటమి ప్రభుత్వాలు 11 సార్లు విదేశీ, స్వదేశీ పెట్టుబడుదారుల సమావేశాలు, సమ్మిట్లు, విదేశీ పర్యటనలు జరిపి 20 నుండి 30 లక్షల మంది యువతీ యువకులకు ఉద్యోగాలు వస్తాయని, పరోక్షంగా మరో 20 లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని చెప్పాయి. మరి ఈ దశాబ్ద కాలంలో ఎంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాయో ప్రభుత్వం స్పష్టంగా తెలియజేస్తే అభివృద్ధి బండారం బయట పడుతుంది. కానీ గడిచిన పదేళ్లలో నిరుద్యోగం, పేదరికం రైతు కూలీల ఆత్మహత్యలు అత్యధికంగా జరుగుతున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. వివిధ ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చి సర్వం త్యాగం చేసిన రైతులకు నేటికీ పరిహారం అందక, మరోపక్క భూములు కోల్పోయి వీధిన పడ్డారు. లక్షలాది రైతు కూలీలు, కౌలుదారులు ఉపాధి కోల్పోయి వలసలు పోతున్నారు. గత పదేళ్లుగా రాష్ట్రంలో సోలార్, పోర్టులు, రిజర్వాయర్లు, ప్రైవేటు పరిశ్రమలు, హైవేలు, పారిశ్రామిక కారిడార్లు, జిందాల్ స్టీల్ ప్లాంట్లు, ఫార్మాసూటికల్స్, కియా, ఎస్ఇజడ్, బిపిసిఎల్, విమానాశ్రయాలు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, రైల్వే లైన్లు, పెట్రో యూనివర్సిటీలు, బల్క్ డ్రగ్స్, మైనింగ్, రాజధాని 15 రకాల ప్రాజెక్టుల పేరు చెప్పి 21 జిల్లాల్లో సుమారు 102 మండలాల్లో 200 పైగా గ్రామాలలో 3,08,970 ఎకరాల పంట భూములు ప్రభుత్వాలు రైతుల నుండి బలవంతంగా లాక్కున్నాయి. ప్రభుత్వం రైతుల నుండి తీసుకున్న భూములను మార్కెట్ రేటు ప్రకారం సగటున ఎకరాకు 30 లక్షల రుపాయల చొప్పున లెక్కించిన 3,08,970 ఎకరాలకు సుమారు 9 లక్షల 26 వేల కోట్ల రుపాయలు ఉంటుంది. ఇన్ని లక్షల కోట్ల విలువైన భూములను తీసుకొని%చదువుకున్న యువతీ యువకులకు కల్పించిన ఉద్యోగాలు నామమాత్రమే. వీరికి వస్తున్న వేతనం కూడా రూ.20 వేల నుండి రూ.50 వేలకు మించి లేదు. అసంఘటిత రంగంలో ఉపాధి కల్పించింది కేవలం 98,950 వేల మందికి మాత్రమే. రోజుకు వీరికిచ్చే వేతనం రూ.400 నుండి రూ.600 మించి లేదు. అది కూడా ఆఫీస్ బారులుగాను, బాత్‌రూమ్ క్లీనర్లు, సెక్యూరిటీ గార్డులు, తోటమాలీలు, హమాలీ వర్కర్లుగా పనులు చూపించి లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నామని అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. పై భూములే కాకుండా గత మూడు నాలుగేళ్లుగా వైసిపి, నేటి తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు అభివృద్ధి అనే ముద్దు పేరుతో 62 మండలాల్లో 170 గ్రామాలలో సుమారు 2,22,500 ఎకరాల భూములు సేకరించడానికి పూనుకున్నారు. వీటిలో కరేడు, కుప్పం, నక్కపల్లి, అన్నేమడుగు, జీలుగుమిల్లి, పెనుగొండ ప్రాంతాలలో సారవంతమైన రెండు, మూడు పంటలు పండే భూములు బలవంతంగా తీసుకొనడానికి నోటీసులు ఇచ్చారు. ప్రశ్నించిన రైతులను బయటికి రాకుండా 30 సెక్షన్ పెట్టి ఉల్లంఘించిన వారిపై కేసులు, వీరికి అండగా ఉంటున్న వామపక్ష పార్టీ ప్రజాసంఘాల నాయకులను ఆ ప్రాంతాలకు వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. ప్రభుత్వాలు మారాయి గాని విధానాల్లో ఎటువంటి మార్పులు లేదు. ఉదాహరణకు రాయలసీమ ప్రాంతంలో ఆసియాలోని అతి పెద్ద సోలార్‌గా చెప్పుకునే ఓర్వకల్లు, ఎన్‌పి కుంట మండలాలలో సుమారు 15 వేల ఎకరాలు తీసుకున్నారు. ఇందులో కనీసం 500 మందికి కూడా స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వలేదు. విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రాంతంలో సుమారు 3500 ఎకరాలు జిందాల్ స్టీల్‌ప్లాంట్ మరియు పరిశ్రమల కోసం 3500 ఎకరాలు తీసుకున్నారు. దశాబ్ద కాలం దాటినా నేటికీ పనులు ప్రారంభించలేదు. పోగా ఇందులో వెయ్యి ఎకరాలను బ్యాంకులో తాకట్టు పెట్టి వందల కోట్లు కొల్లగొట్టారని వార్తలు వస్తున్నాయి. అదే విధంగా ఈ భూములన్ని బీళ్లుగా మారాయి. రైతులకు ఆ భూములు తిరిగి ఇవ్వాలని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో గడిచిన కాలంలో 25 వేల 134 ఎకరాలు తీసుకున్నారు ఉపాధి చూపింది కేవలం 1000 మందికి మించి లేదు. నిర్మాణ పనులకు అసంఘటిత రంగంలో 65 వేల మందికి పని చూపించామని చెప్తే వీరిలో స్థానికులకు ఇచ్చింది కేవలం 15 వేలకు మించి లేదు. మిగిలిన 50 వేల మంది పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన వారే.

## రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధుల భేటీ



**హైదరాబాద్, పతాకం న్యూస్:** అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ ఆన్ గోయింగ్ సెంటర్లు, వాటి విస్తరణపై చర్చించింది. ఈ సమావేశానికి ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్, ఇన్‌ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హోస్పర్ బృందం కూడా ముఖ్యమంత్రితో సమావేశమైంది. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి తెలిపింది. డ్యూయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. దీని ద్వారా రానున్న రెండేళ్లలో సుమారు వెయ్యి మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వెల్లడించింది. పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడానికి జర్మనీ సహకారం అవసరమని అన్నారు. తెలంగాణ విద్యార్థులకు జర్మన్ భాష బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని ముఖ్యమంత్రి కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ, జర్మనీ భాగస్వామ్యం మరింత బలపడాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్స్ రంగాల్లో జర్మనీ కంపెనీలను పెట్టుబడులు పెట్టమని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.


## తిరుపతి బస్టాండూ అదానికే

### 'పిపిపి'లో రూ.500 కోట్లతో 11 అంతస్తుల్లో ఆర్‌టిసి టెర్మినల్ నిర్మాణం.. పై భాగంలో హెలిప్యాడ్




**తిరుపతి , పతాకం న్యూస్:** రాష్ట్రంలోని పలు ఆస్తులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానికి కట్టబెట్టాయి. ఇప్పుడు ఆధ్యాత్మిక యాత్రా స్థలమైన తిరుపతిలోని బస్టాండ్‌ను కూడా బంగారు పళ్లెంలో ఆయనకే సమర్పించేందుకు రంగం సిద్ధమైంది. రూ.500 కోట్లతో 11 అంతస్తులను 'పిపిపి' (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) పద్ధతిలో నిర్మించి మొత్తం రెండు వేల కోట్ల రూపాయల విలువైన ఆర్‌టిసి ఆస్తులను అప్పనంగా అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోంది. ప్రస్తుతం ఉన్న తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్ కూల్చివేత గత నెల రోజులుగా ప్రారంభమైంది. పూర్తి స్థాయిలో కూలదోసి ఆ స్థానంలో ఆర్‌టిసి టెర్మినల్‌ను నిర్మించనున్నారు. తిరుపతి ఇంటిగ్రేటెడ్ మోడల్ బస్‌స్టేషన్‌లో 'కార్పొరేట్' శక్తులకు అనువుగా ఉండేలా 'హెలిప్యాడ్'ను సైతం ఏర్పాటు చేస్తున్నారు. తిరుపతి ఎయిర్‌పోర్టును అదానికి అప్పగించేందుకు కేంద్రం ప్రభుత్వం సిద్ధమవుతోంది. తిరుపతి ఇంటిగ్రేట్ మోడల్ బస్‌స్టేషన్‌ను అత్యాధునికంగా నిర్మించి టిడిపి కూటమి ప్రభుత్వం అదానికే కట్టబెట్టనుందనే చర్చ నడుస్తోంది. త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేయనున్నారు. మూడేళ్లలో నిర్మాణాలు పూర్తి కానుందని చెప్తున్నారు. రాష్ట్రంలోనే తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలోనే 'ఎర్నింగ్ ఫర్ కిలోమీటరు'లో తిరుపతి రీజియన్ మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో 'విశాఖ' ఉంది. రోజుకు రూ.2 కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తున్న తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను ప్రభుత్వం కారుచౌకగా 'కార్పొరేట్'కు కట్టబెట్టనుండడంపై ఆర్‌టిసి కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తిరుమల–తిరుపతికి రోజుకు లక్ష మందికిపైగా ప్రయాణికులు, యాత్రికులు వస్తున్నారు. ఇందులో 60 వేల మందికిపైగా ఆర్‌టిసి బస్సుల్లోనే చేరుకుంటున్నారు. ఈ సంఖ్య 2,034 నాటికి లక్ష, 2,052 నాటికి 1.50 లక్షలకు చేరుకొనే అవకాశం ఉందని అంచనా. ఈ నేపథ్యంలో తిరుపతి ఇంటిగ్రేటెడ్ మోడల్ బస్‌స్టేషన్‌ను నిర్మిస్తున్నామని పాలకులు చెబుతున్నారు. అయితే, 'పిపిపి' పద్ధతిలో నిర్మించడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్, ఓ ప్రైవేట్ కంట్రాక్టర్ కలిసి ఈ బస్టాండ్ నిర్మాణం చేపట్టనున్నారు. తిరుపతి సెంట్రల్ బస్‌స్టేషన్ 13.5 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. స్థలం విలువ ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం 1,500 కోట్ల రూపాయలపైమాటే. పిపిపి పద్ధతిలో రూ.500 కోట్లతో ఆర్‌టిసి టెర్మినల్‌ను నిర్మించనున్నారు. ఆధునిక సౌకర్యాలతో 11 అంతస్తుల్లో నిర్మాణం చేపట్టనున్నారు. బస్టాండ్, హోటళ్లు, రెస్టారెంట్లు, బ్యాంకులు, కార్యాలయాలు, హెలిప్యాడ్, హైమాక్స్ తదితర అత్యంత అధునాతన వసతులతో నిర్మించనున్నారు. 150 బస్ ప్లాట్ ఫారాలతోపాటు, స్కూటర్లు, కార్లకు పార్కింగ్ సౌకర్యం, ఎలక్ట్రిక్ బస్సులకు ఛార్జింగ్ సౌకర్యం ఉంటుంది. హర్యానాకు చెందిన 'రైట్స్' సంస్థ గత ఏడాది డిసెంబర్ నుంచి మూడు నెలల పాటు బస్టాండ్ ఆదాయ వనరులపై అధ్యయనం చేసింది. తిరుమల ఆధ్యాత్మిక క్షేత్రం, పర్యాటక ప్రాంతం కావడం, తిరుపతిలో ఎయిర్‌పోర్టు, రైల్వే స్టేషన్ ఉండడం, చెన్నరు–బెంగుళూరు మెట్రోపాలిటిన్ సిటీలు సమీపంలో ఉండడం వల్ల నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ బస్టాండ్‌కు మంచి ఆదరణ ఉంటుందని అంచనా.

## హిందుజా గ్రూప్ చైర్మన్ కన్నుమూత



**న్యూఢిల్లీ , పతాకం న్యూస్:** హిందుజా సోదరులలో అగ్రజుడైన గోపీచంద్ చాలాకాలంగా అస్వస్థతతో ఉన్నారు. వాణిజ్య వర్గాల్లో 'జీపీ'గా పేరుపొందిన ఆయన హిందుజా కుటుంబంలో రెండో తరానికి చెందిన వారు. 2023 మేలో తన సోదరుడు శ్రీచంద్ మరణాంతరం గ్రూప్ సంస్థలకు చైర్మన్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. గోపీచంద్‌కు భార్య సునీత, కుమారుడు సంజయ్, ధీరజ్‌లు ఉన్నారు. గోపీచంద్ 1959లో ముంబై జైహింద్ కాలేజీలో గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. 1959లో ఫ్యామిలీ బిజినెస్‌లో చేరారు. ఇండో–మిడిల్ ఈస్ట్ ట్రేడింగ్ ఆపరేషన్ల విషయంలో కీలకంగా వ్యవహరించారు.

## పోలీసుశాఖకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం: అనిత



**గుంటూరు, పతాకం న్యూస్:** పోలీసు శాఖకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర హోంశాఖా మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. పోలీసు శాఖ సమర్ధవంతంగా పని చేయాలంటే సదుపాయాల కల్పన అవసరమన్నారు. రాజధాని లోని వెలగపూడిలో డి ఎస్పి కార్యాలయాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2014 – 19 లో టిడిపి ప్రభుత్వం హయాంలో ఎకరం స్థలంలో డి ఎస్ పి కార్యాలయం నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారని, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణం సంగతి పట్టించుకోలేదన్నారు. పోలీసుల ఆరోగ్యం, భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందని చెప్పారు. రాజధానిలో ఎస్పి క్యాంపు కార్యాలయం ఏర్పాటుతో పాటు సిబ్బంది సంఖ్యను పెంచుతామని చెప్పారు. 6,100 మంది పోలీసులను రిక్రూట్మెంట్ ద్వారా తీసుకోవడం జరిగిందని, శిక్షణలో ఉన్న వారందరూ త్వరలో విధుల్లో చేరతారన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలను సమర్ధవంతంగా ఎదుర్కొంటామని, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారంను ఉపేక్షించ బోమన్నారు. రైతుల త్యాగాల వల్లనే అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఐజి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఇతర పోలీస్ అధికారులు, రాజధాని రైతులు పాల్గొన్నారు.

## కారును ఢీకొట్టిన ట్రక్కు.. ఆరుగురు మృతి



**ఉత్తరప్రదేశ్** :ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బారాబంకిలోని దేవా- ఫతేపూర్ రహదారిపై ట్రక్కు కారును బలంగా ఢకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. ఇద్దరికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి బారాబంకి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అర్పిత్ విజయవర్గియ తెలిపిన వివరాల ప్రకారం.. ఎనిమిది మందితో వెళుతున్న కారును దేవా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ట్రక్కు బలంగా ఢకొట్టింది. దీంతో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఆరుగురు మృతి చెందారు. మెరుగైన చికిత్స కోసం ఇద్దరినీ వేరే ఆసుపత్రికి తరలించాము. కారు, ట్రక్కు రెండు వాహనాలు వ్యతిరేక దిశలో వస్తున్నాయి. అందువల్లే ఈ ప్రమాదం జరిగింది అని ఆయన అన్నారు.

## రాజీపడబోం: పవన్

(మొదటిపేజీ తరువాయి)

ఈ క్రమంలో దెబ్బతిన్న రోడ్లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సహకారంతో ఏపీకి సాస్కి నిధులు సమకూరాయని చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో వీటిని సద్వియోగం చేసుకుందామని సూచించారు. ఈ నేపథ్యంలో సాస్కి నిధుల వినియోగించే ప్రణాళికపై పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు పవన్ కల్యాణ్. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని వివరించారు. ప్రత్యేక శ్రద్ధతో మన గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి సాస్కి నిధులు తీసుకువచ్చామని ఉద్ఘాటించారు. వీటి ఫలాలు ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపైనా, అధికార యంత్రాంగంపైనా ఉందని చెప్పుకొచ్చారు. ప్రతి నియోజకవర్గంలో రోడ్లు మెరుగుపడే విధంగా నిధులు సమకూరుస్తున్నామని తెలిపారు. ఎక్కడా నాణ్యత విషయంలో రాజీపడవద్దని మార్గనిర్దేశం చేశారు పవన్ కల్యాణ్ . రహదారుల నిర్మాణంలో నిబంధనలకు అనుగుణంగా, ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదేనని హుకుం జారీ చేశారు. నిర్మాణం కాంట్రాక్టు పొందినవారికీ ముందుగానే నాణ్యతా ప్రమాణాల గురించి తెలియజేయాలని ఆదేశించారు. ఆ ప్రమాణాలకు తగ్గట్లు నిర్మాణాల నాణ్యతా ప్రమాణాలని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. నిర్మాణం ప్రారంభించిన తర్వాత పలు దశల్లో క్వాలిటీ చెక్ చేయాలని ఆజ్ఞాపించారు. తాను, నిపుణులు క్షేత్ర స్థాయికి వెళ్లి నాణ్యతా ప్రమాణాలు పాటించారో లేదు తనిఖీ చేస్తామని స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేకపోతే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని.. ఏ మాత్రం అవకతవకలు జరిగినా ఉపేక్షించవద్దని హెచ్చరించారు పవన్ కల్యాణ్. 'ప్రజలకు పటిష్టమైన రోడ్లు అందించడం అవసరం. మౌలిక వసతుల కల్పనలో రహదారులు కీలకమైనవి. సాస్కి ద్వారా వస్తున్న రూ.2వేల కోట్లతో ప్రాధాన్యత క్రమంలో రోడ్లు నిర్మించుకొనే అవకాశం వచ్చింది. ప్రత్యేకమైన ప్రాంతాల్లో, సందర్భాల్లో ఈ నిధుల నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయొచ్చు. పుట్టపర్తిలో సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా అక్కడ మౌలిక వసతులు కల్పనలో భాగంగా పంచాయతీ రోడ్లు పటిష్టపరచాలని ప్రజాప్రతినిధులు, అధికారులు వివరించారు. ఇందుకోసం రూ.35 కోట్లను ఈ నిధుల నుంచి వెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇలాంటి కీలకమైన అభివృద్ధి పనులకు సాస్కి నిధులు ఎంతగానో తోడ్పడతాయి. రోడ్ల నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంతో వ్యవహరించింది. వివిధ మార్గాల్లో ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వచ్చే వెసులుబాటు ఉన్నప్పటికీ, దానిని విస్మరించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎప్పటికప్పుడు ఏపీలోని వివిధ అభివృద్ధి పనులకు నిధులు సాధిస్తున్నాం. సాస్కి నిధులు విడుదల చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము. నిధులు పొందటంలో, వాటిని వినియోగించే ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించాలనే కృతనిశ్చయంతో ఉంది. ఇందులో అధికార యంత్రాంగం కీలక భూమిక పోషించాలి' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# మరిడిమాంబ జాతర మహోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు



**పరవాడ, పతాకం న్యూస్:** పరవాడ మండలం, కొంగుబంగారం,కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ వెన్నెలపాలెం గ్రామంలో ఈనెల 6 తేదీన భక్తుల పాలిట మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవంను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు అమ్మవారి జాతరలో నిర్వహించబోయే కార్యక్రమాలకు సంబంధించి ముద్రించిన గోడపత్రికను మంగళవారం స్థానిక నాయకులతో కలిసి తెదేపా సీనియర్ నేత, మాజీ మంత్రి, మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెన్నెల ఏకుల అప్పారావు, వెన్నెల అప్పలనాయుడు, వెన్నెల వెంకినాయుడు, మాజీ ఎంపీటీసీ పైల రతాల సన్యాసిరావు, ఉపసర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, వెన్నెల నరసింహారావు, పైల జూనియర్ అప్పలనాయుడు, పైల ప్రసాద్, లోకిరెడ్డి అభినాయుడు, భోజంకి అప్పలనాయుడు, గొంప మారునాయుడు, వెన్నెల వెంకట గిరి, వాసిరెడ్డి ఈశ్వరరావు, బండారు వీరునాయుడు, బండారు సతీష్, పైలా శివశంకర్, వెన్నెల ప్రసాద్, పైల రమణాజీ, తదితర స్థానిక నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## చెకుముకి సైన్స్ సంబరాలు



**అడ్డతీగల, పతాకం న్యూస్:** జన విజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్థానిక ఎం ఆర్ సి నందు చెకుముకి సైన్స్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షకు అడ్డతీగల మండలంలో ఏనిమిది హైస్కూల్స్ నుండి విద్యార్థులు హాజరవడం జరిగింది. ఈ పరీక్షలో గవర్నమెంట్ హైస్కూల్స్ నుండి జెపిహెచ్ఎస్ గొంతువానిపాలెం విద్యార్థులు ప్రథమ స్థాయి,ప్రైవేట్ పాఠశాల నుండి హెూషన్నా హై స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థాయి సాధించడం జరిగింది. ఈ విద్యార్థులు తదుపరి జరుగు జిల్లా స్థాయి పరీక్షల్లో పాల్గొంటారు. కనుక విద్యార్థులను ప్రోత్సహించడానికి యూ టి ఎఫ్ మండల శాఖ వారి చేతులు మీదగా మెమొంటోస్ మరియు మెడల్స్ ఇవ్వడం జరిగింది. ముఖ్య అతిథులు అడ్డతీగల మండల ఎంపిడిఓ ఏ వి వి కుమార్ ,రంపచోడవరం మండల స్పెషల్ ఆఫీసర్ రుక్మాండయ్య (డి డి) విచ్చేసి యున్నారు. అనంతరం వారి చేతులమీదుగా ప్రథమ స్థాయి పొందిన విద్యార్థులకు మెడల్స్, మేమెంటోస్ మరియు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు శ్రీ కె.రమేష్ ఎంఇఓ 1 మరియు పి .శ్రీనివాసరావు ఎంఇఓ 2 పాల్గొన్నారు. అదేవిధంగా యూ టి ఎఫ్ మండలం ప్రధాన కార్యదర్శి రాఘవులు,జిల్లా ఆడిటర్ మంగరాజు, ఎఫ్ డబ్ల్యూ ఎస్ చిన్నారావు, జగదీష్ మరియు చెకిముకి టెస్ట్ నిర్వహణ అధికారి చిన్నిబాబు, ఉపాధ్యాయలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## 'మత్తు వదులుదాం - మంచి సమాజం కోసం పోరాడుదాం' అనే అంశంపై జిల్లా సదస్సు



**చోడవరం, పతాకం న్యూస్ :** విద్యార్థి, యువతను తప్పు దోవ పట్టిస్తున్న సమాజ వినాశనానికి కారణమవుతున్న మద్యం, మత్తు పదార్థాలు, గంజాయి, అశ్లీల సినిమాలను, వెబ్ సిరీస్ లను ప్రభుత్వం తక్షణమే నిషేధించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పిడిఎస్ఓ), నవ యువ సమాఖ్య (ఎన్. వై. ఎస్) డిమాండ్ చేశాయి. మంగళవారం ఈ సంఘాల ఆధ్వర్యంలో మద్యం, మత్తు పదార్థాలు, గంజాయిని నిషేధించాలని నినదిస్తూ స్థానిక వినాయకుడు గుడి దగ్గర నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ లక్ష్మీపురం రోడ్డు మీదగా శ్రీ వెంకటేశ్వర కళ్యాణ మండపం వరకు ర్యాలీ చేసి సభ నిర్వహించారు. ఈ సభకు నందారపు భాస్కర్ అధ్యక్షత వహించగా ముఖ్య వక్త డాక్టర్ పి. శకుంతల రావు మాట్లాడుతూ విద్యార్థులు, యువత నేడు ఈ మద్యం, మత్తు పదార్థాలు, గంజాయికి అలవాటు పడి తమ చదువును, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వీటి నుండి యువత బయటపడాలని అన్నారు. విద్యార్థులకు ఇటువంటి హానికరమైన మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే ఆలోచనలను కలిగించే పాఠాలు సిలబస్లో రూపొందించాలని, అలాగే సినిమాల్లో విద్యార్థి యువకులను తప్పుడు ప్రభావాలను కలిగించే అంశాలు లేకుండా చూడాలని కోరారు. పిడిఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఏ. సురేష్ మాట్లాడుతూ విద్యార్థి, యువకుల జీవితాలను నాశనం చేస్తున్న సమాజానికి హానికరమైన గంజాయి, మద్యం, మత్తు పదార్థాలను ప్రభుత్వం తక్షణమే నిషేధించాలని అన్నారు. మద్యం, గంజాయి వ్యాపారులు లక్షల కోట్లు సంపాదిస్తుంటే, పాతికేళ్ల లోపు యువకులే ఎక్కువగా ఈ మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జైలులో ఉంటున్నారన్నారు. సినిమాలు, సోషల్ మీడియా, వెబ్ సిరీస్ లు వీటన్నింటిలో విచ్చలవిడిగా విష సంస్కృతిని వెదజల్లుతూ విద్యార్థి, యువత ప్రశ్నించకుండా వారి మెదళ్లను మొద్దు బార్చుతున్నారని అన్నారు. ఇంతటి ప్రమాదకరమైన విద్యార్థి,యువతరం మత్తును వదిలి అందరికీ విద్య, వైద్యం ఉపాధి లభించే మంచి సమాజం కోసం పోరాడాలని పిలుపిచ్చారు. ఓపిడిఆర్ రాష్ట్ర నాయకులు గౌరీ శంకర్ మాట్లాడుతూ ఆడవారిపై అత్యాచారాలు జరగడానికి, రోడ్డు యాక్సిడెంట్ లకు, కుటుంబ కలహాలకు ఈ మత్తు పదార్థాలే ప్రధాన కారణాలు అన్నారు. ప్రతి గ్రామానికి మద్యం షాపులు నడుపుతున్న ప్రభుత్వం పాఠశాలను ఎందుకు నడపట్లేదని దుయ్యబట్టారు. స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ ఓ .లక్ష్మీ కుమారి మాట్లాడుతూ మద్యం, గంజాయి తాగి అటు వారి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటూ మరొకవైపు ఆడపిల్లలపై అత్యాచారాలు, దాడులకు యువతరం పాల్పడుతున్నారని కాబట్టి ఈ మద్యం, గంజాయిని నిర్మూలించనంతవరకు ఆడవారిపై దాడులు ఆగవన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ నాయకులు కే.వరహాల నాయుడు, బి. వరుణ్, ఎం. తరుణ్ , ఎన్ వై ఎస్ నాయకులు పి.రమేష్, వై. రాజు, కే. శివశంకర్ 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## 89వ వార్డు లో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ





**గోపాలపట్నం, పతాకం న్యూస్:** పశ్చిమ నియోజకవర్గం 89వ వార్డులో మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం లో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు మల్ల విజయ ప్రసాద్, 89 వ వార్డు నాగేంద్ర కాలనీలో రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దొడ్డి కిరణ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం కు ముఖ్య అతిథిగా పాల్గొన్న పశ్చిమ మాజీ శాసనసభ్యులు మళ్ళ విజయ ప్రసాద్. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు . ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ప్రభుత్వ మెడికల్ కళాశాల ల ప్రైవేటైజేషన్ కు వ్యతిరేకం గా సంతకాలు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా మెడికల్ కాలేజీ ల ప్రైవేటీకరణ వలన కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించారు. ప్రజా వైద్య సదుపాయాల రక్షణ కోసం ప్రతి సంతకం ప్రజా హక్కుల కోసం ఒక బలమైన స్వరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఆళ్ల పైడి రాజు, పెన్మత్స శ్రీధర్ వర్మ ,అల్లు సఖి,అసి లక్ష్మీ,కర్రి గౌరీ కర్రి ఉమ్మ,కాళ్ళ మురళీ,శంకర్ రావు,చంద్ర రావు,తులసి,తేజ, మనీ,రవణమ్మ ,గంగాధర తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై మహాలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**పరవాడ, పతాకం న్యూస్:** విద్యార్థులలో భద్రతా, చట్టపరమైన అవగాహన కల్పించేందుకు పరవాడ ఉమెన్ ఎస్ఐ మహాలక్ష్మి, తానం గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్ ను మంగళవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి స్కూల్ సిబ్బంది సమక్షంలో విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మైనర్స్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే కూడదని తెలియజేశారు. తల్లిదండ్రులు, టీచర్లు లేదా వార్డెన్ అనుమతి లేకుండా స్కూల్ పరిధిని దాటి బయటకు వెళ్లరాదు. నీటి ప్రదేశాలు, కుంటలు, సముద్రతీరాలు వంటి ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లరాదు. ఇటీవల ముత్యాలమ్మపాలెం బీచ్‌లో ఈత కొట్టడానికి వెళ్లి మునిగి మరణించిన విద్యార్థి ఘటనను ఉదహరిస్తూ, విద్యార్థులు ఇలాంటి ప్రమాదకర చర్యలకు పాల్పడకూడదని హెచ్చరించారు. మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, వాటి చట్టపరమైన పరిణామాలు వివరించి, విద్యార్థులు సమాజంలో బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ గణేష్, హాస్టల్ వార్డెన్ పి.ఎల్. నారాయణరావు, డ్రిల్ టీచర్ షామా, ఫిజిక్స్ టీచర్ రాజశేఖర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పరవాడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా నిర్వహించబడింది.

## విశాఖలో భూ ప్రకంపనలు..
# ఉలిక్కిపడిన నగరవాసులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం నగరంలో మంగళవారం తెల్లవారుజామున స్వల్ప భూకంపం సంభవించింది. నగర ప్రజలు గాఢ నిద్రలో ఉండగా, భూమి కొన్ని సెకన్లపాటు కంపించడంతో భయాందోళనలకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. వివరాల్లోకి వెళితే, ఈరోజు తెల్లవారుజామున 4:16 నుంచి 4:20 గంటల మధ్య ఈ భూ ప్రకంపనలు సంభవించాయి. గాజువాక, మధురవాడ, రిషికొండ, భీమిలి, కైలాసపురం, మహారాణిపేట, విశాలాక్షినగర్, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లో భూమి కంపించినట్లు స్థానికులు పేర్కొన్నారు. అకస్మాత్తుగా సంభవించిన ఈ పరిణామంతో నిద్ర నుంచి ఉలిక్కిపడిన నగరవాసులు ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందారు. భయంతో కుటుంబ సభ్యులతో కలిసి ఇళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపై గుమిగూడారు. కొంతసేపటి వరకు ఇళ్లలోకి వెళ్లడానికి కూడా జంకారు. అయితే, ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై ఎంత నమోదైందనే వివరాలు ఇంకా అధికారికంగా వెలువడలేదు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు సమాచారం లేదు.

## రాజవొమ్మంగిలో మహిళా క్రికెట్ వరల్డ్ కప్ సంబరాలు



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్ :** రాజవొమ్మంగి గాంధీ బొమ్మ సెంటర్లో ప్రపంచ మహిళా క్రికెట్ వరల్డ్ కప్ సాధించినందుకు సిఐటియు మహిళా సభ్యులు, స్థానిక మహిళలు కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేసి మహిళా టీం సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సిఐటియు నాయకురాలు వెంకటలక్ష్మి మాట్లాడుతూ కరణం మల్లీశ్వరి ఒలింపిక్ మెడల్ గెలిస్తే చాలా మంది స్ఫూర్తి పొందారన్నారు, పీవీ సింధు విజయాలతో పొంగిపోయి బ్యాట్లు పట్టారన్నారు, మను బాకర్ మెడల్ తో షూటింగ్ ఆదరణ పొందింది. ఈ వరల్డ్ కప్ ఖచ్చితంగా ఉమెన్ క్రికెట్ కి ఓ టర్నింగ్ పాయింట్ అవుతుందని ఆనందం వ్యక్తం చేశారు. కపిల్ దేవ్ టీమ్ వరల్డ్ కప్ గెలవడమే భారత క్రికెట్ రూపురేఖలు మార్చడంలో మొదటి అడుగన్నారు, మహిళా క్రికెట్ మరో మెట్టు ఎక్కేందుకు ఇదో మార్పు సూచిక అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు గ్రామస్తులు గ్రామ పెద్దలు సత్యవతి, కుమారి, చిన్న తల్లి, ఆదిలక్ష్మి, నూకరత్నం, మాజీ సర్పంచ్ చీడిపల్లి అప్పారావు, శేషగిరి, రాంబాబు, శ్రీను, తాటి తూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు

## తప్పుడు పద్ధతులలో భూమి పట్టాలు చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి



**అడ్డతీగెల, పతాకం న్యూస్ :** అడ్డతీగల మండలం గొండోలు పంచాయితీ సరంపేట గ్రామ పరిధిలో గల సుమారు 7 ఎకరాల ఆదివాసి పట్టా భూములను తప్పుడు మార్గంలో నాన్ ట్రైబల్స్ పట్టాలు చేయించుకొని ఉన్నారని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్ చేసింది. పరిషత్ మండల అధ్యక్షురాలు కారు అరుణకుమారి మాట్లాడుతూ నాన్ ట్రైబల్ టు నాన్ ట్రైబల్ మధ్య అమ్మకాలు, కొనుగోలు జరిగాయన్నారు. ఇది పూర్తిగా ఎల్ టి ఆర్ చట్టానికి విరుద్ధమని కావున తప్పుడు పట్టాలు చేయించిన వారిపై 1/70 చట్టానికి విరుద్ధంగా భూభాదలయింపులు జరిపిన నాన్ ట్రైబల్స్ పై మరియు చట్ట విరుద్ధంగా పట్టాలు చేసిన గత అధికారులపై చర్యలు చేపట్టాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షురాలు కారు అరుణ కుమారి మంగళవారం అడ్డతీగల తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఇటువంటి చట్ట విరుద్ధమైన భూ బదలాయింపులు గొండోలు పంచాయతీలు పరిధిలోని దాదాపు 1500 ఎకరాలకు పైగా జరిగాయని, వీటన్నిటిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను కోరారు . ప్రభుత్వ భూములు కూడా కబ్జాకు గురై నాన్ ట్రైబల్స్ సాగులో ఉన్నాయని గతంలో కూడా వీటి మీద ఫిర్యాదు చేయగా, సంబంధిత రెవెన్యూ అధికారులు ఎటువంటి ప్రభుత్వ భూములు లేవని చెప్పటం విడ్డూరంగా ఉందని ఆమె మండిపడ్డారు. ఏజెన్సీలో ఆదివాసి చట్టాలకు విరుద్ధంగా కొనసాగుతున్న వ్యవసాయాలు, వ్యాపార సముదాయాలను అరికట్టాలని, అక్రమ కట్టడాలను తక్షణమే తొలగించాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే కొలికపూడి

(మొదటిపేజీ తరువాయి)

తన నుంచి కేశినేని చిన్ని రూ.5 కోట్లు డిమాండ్ చేసి తీసుకున్నారంటూ కొలికపూడి శ్రీనివాసరావు సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన బ్యాంకు స్టేట్‌మెంట్లను కూడా ఆయన తన వాట్సాప్ స్టేటస్‌లో పోస్ట్ చేశారు. ఈ పోస్టులు పార్టీలో పెద్ద దుమారం రేపాయి. కొలికపూడి ఆరోపణలపై ఎంపీ కేశినేని చిన్ని తీవ్రంగా స్పందించారు. తనపై ఎవరు పడితే వారు ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మరని, తన క్యారెక్టర్ వేరని ఘాటుగా సమాధానమిచ్చారు. "పొద్దున్నే దేవినేని అవినాష్‌లా, మధ్యాహ్నం పేర్ని నానిలా, సాయంత్రం కేశినేని నానిలా ఉండే వ్యక్తిని కాదు," అంటూ వ్యాఖ్యానించారు. 12 నెలల పాటు తనను దేవుడని పొగిడిన కొలికపూడి, ఇప్పుడు దెయ్యం అని ఎందుకు అంటున్నారో ఆయనే చెప్పాలని ఎద్దేవా చేశారు. ఆయన అపరిపక్వతతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.

# నిలిచిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు!



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** పుట్టుకతోనే వినికిడి సమస్యతో బాధపడే చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిర్వహించే కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు గడిచిన నాలుగు నెలలుగా నిలిచిపోయాయి. అత్యంత ఖరీదైన ఈ శస్త్ర చికిత్సలను ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేయిస్తోంది. అయితే, ఇప్పటివరకూ జరిగిన వాటికి సంబంధించి ఆడిట్‌ను నిర్వహిస్తున్నందున తాత్కాలికంగా శస్త్ర చికిత్సలు నిలిపివేయాలంటూ జిల్లాలోని ఆస్పత్రులకు ఆదేశాలు అందాయి. సాధారణంగా 11 నెలలు వయసు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు మాత్రమే ఈ కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలను చేస్తుంటారు. మూడేళ్లలోపు చేయించుకుంటే ఫలితం మెరుగ్గా ఉంటుంది. అయితే, చిన్నారుల్లో సమస్యను తల్లిదండ్రులు సకాలంలో కనుగొనలేకపోతున్నారు. మూడు, నాలుగేళ్లు దాటిన తరువాత కొందరు, ఐదేళ్లు వచ్చిన తరువాత మరికొందరు గుర్తించగలుగుతున్నారు. చిన్నారులకు వివిధ రకాల పరీక్షలు చేసి, వారు శస్త్రచికిత్సకు అర్హులు అని నిర్ధారించేందుకు కనీసం ఆరు నెలలు సమయం పడుతుంది. ఈలోగా వయసు ఐదేళ్లకు మించకూడదు. అప్పుడు మాత్రమే శస్త్ర చికిత్స నిర్వహిస్తారు. అయితే, ఇప్పుడు నాలుగు నెలల నుంచి శస్త్ర చికిత్సలను నిర్వహించే ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో చాలామంది చిన్నారులకు వయసు దాటిపోతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి వెంటనే ప్రక్రియను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు. కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సలను పెదవాల్తేరులోని ప్రభుత్వ ఈఎన్‌టీ, గాయత్రీ ఆస్పత్రిలో నిర్వహిస్తున్నారు. ఈ రెండు ఆస్పత్రుల్లో నెలకు ఆరు నుంచి ఎనిమిది వరకు నిర్వహిస్తుంటారు. ఈ శస్త్ర చికిత్స నిర్వహించడానికి ముందు చిన్నారికి ఆస్పత్రి అధికారులు పరీక్షలు నిర్వహించి, అనంతరం అమర్చాల్సిన పరికరం కోసం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు ఇండెంట్ పెడతారు. ప్రభుత్వమే ఆయా పరికరాలను కొనుగోలు చేసి ఆస్పత్రులకు సరఫరా చేస్తుంది. ఒకేసారి నెలకు ముగ్గురు, నలుగురు చిన్నారులకు అవసరమైన పరికరాల కోసం అధికారులు ఇండెంట్ పెడుతూ ఉంటారు. ఇలా పరికరాలు వచ్చిన తరువాత చిన్నారులకు శస్త్రచికిత్సలను నిర్వహిస్తారు. శస్త్రచికిత్స అనంతరం సదరు చిన్నారులకు స్పీచ్ థెరపీ వంటివి చేయడం ద్వారా సాధారణ స్థితికి తీసుకువస్తారు. ఈ శస్త్రచికిత్సను బయట చేయించుకోవాలంటే సుమారు రూ.8 లక్షలు నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ప్రభుత్వమే ఈ మొత్తాన్ని భరించి ఎన్టీఆర్ వైద్య సేవలో చేస్తుండడంతో ఎంతోమంది చిన్నారులకు మేలు చేకూరుతోంది. ఈ శస్త్ర చికిత్సల కోసం ఇటు ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన చిన్నారులు నగరంలోని ఆస్పత్రులకు వస్తుంటారు. ఇప్పుడు వారంతా మళ్లీ ఈ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందా?...అని ఎదురుచూస్తున్నారు.

## 'అరకులోయ'లో జీఎస్టీ ఫలాలు.. ప్రజల ఆశలు నేలకొరగా.. అధికారుల నిర్లక్ష్యం మీద మండిపాటు




**అరకులోయ, పతాకం న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రముఖ పర్యాటక కేంద్రం అరకులోయ పట్టణంలో పర్యాటకులకు, స్థానిక వినియోగదారులకు జీఎస్టీ ఫలాలు చేతికందని ద్రాక్షల మారాయి. 2025 సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి వచ్చిన నూతన జీఎస్టీ సంస్కరణలు సుమారు 50 రోజులు పూర్తి కావస్తున్నా, ఈ ప్రాంత ప్రజలకు ఎటువంటి లాభం చేకూరలేదు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం 'జీఎస్టీ 2.0' సంస్కరణలతో పేదలు, మధ్యతరగతి, నిరుపేదలకు భారీ ఆదా దొరుకుతుందని, వస్తువుల ధరలు గణనీయంగా తగ్గుతాయని ప్రకటిస్తూ 'సూపర్ సేవింగ్' అవగాహన సదస్సులు నిర్వహిస్తుంటే, వాస్తవంగా జీఎస్టీ ముందు ధరలు మారకుండా, కొన్ని సరుకులు మరింత ధరలు పెరిగిపోతున్నాయి. దీంతో ప్రజలు ఆక్షేపాలు, నిరాశలతో మండిపడుతున్నారు.

జీఎస్టీ అమలు ముందు వినియోగదారులకు ఏ ధరలకు వస్తువులు లభించాయో, తర్వాత కూడా అదే ధరలు లేదా అంతకంటే ఎక్కువకు నిత్యావసర సరుకులు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ సామగ్రి అందుతున్నాయి. సెప్టెంబర్ 22న జీఎస్టీ 2.0 అమలైనప్పటికీ, మొదటి వారంలో ధరలు తగ్గుతాయని ఆశించిన ప్రజలకు ఇప్పుడు నిరాశ మాత్రమే మిగిలింది. 50 రోజులు గడిచినా ధరలు తగ్గకపోగా, కొన్ని సరుకుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని 'బూచిగా' చూపిస్తూ ప్రజలను మునగ చెట్టు ఎక్కించినట్లు, కానీ ములం కాడ విరిగి నేలపై పడినట్లు వారి ఆశలు కూడా చిదిగిపోతున్నాయని అరకులోయ మండల ప్రజలు వాపోతున్నారు.ఏ వస్తువుల ధరలూ తగ్గినట్లు దాఖలాలు లేవు. గతంలో ఉన్నట్లే గృహపకరణాలు, గృహసామగ్రి, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పాలకులు చెప్పినట్లు 'సూపర్ సేవింగ్' ఎవరికి అందుతుందని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల్లో 12% మరియు 28% స్లాబులను తొలగించి, 5% మరియు 18% స్లాబులకు మార్చడం, కొన్ని అవసరాల సరుకులపై ధరలు తగ్గించడం వంటివి అమలులోకి వచ్చాయి. కానీ అరకులోయలో ఇలాంటి మార్పులు కనిపించకపోవడం ఆశ్చర్యకరం.ఇది మాత్రమే కాదు, జీఎస్టీ అమలై 50 రోజులు గడిచినా అరకులోయ పట్టణంలో ఏ దుకాణంలోనూ నూతన ధరల పట్టికలు కనిపించకపోవడం మరో సమస్య. నిరక్షరాస్యులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో వాణిజ్య వ్యాపారులు ధర పట్టికలు లేకుండా ఎలా జీఎస్టీ ఫలాలు ప్రజలకు అందుతాయని వినియోగదారులు ఆక్షేపిస్తున్నారు. అధికారులు మౌనంగా ఉండి, వారి సంక్షేమాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో వ్యాపారులకు ఇది వరంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు, వాణిజ్య పన్నుల విభాగం అధికారులు, మండల రెవెన్యూ శాఖ సిబ్బంది, మండల ప్రజాపరిషత్ సిబ్బంది తక్షణమే స్పందించి అరకులోయ ప్రాంతంలో సమగ్ర తనిఖీలు నిర్వహించాలి. గృహ, నిత్యావసర సరుకుల ధరల్లో తేడాలు గమనించి వ్యాపారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

# కోటి సంతకాలతో ప్రైవేట్ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుందాం: ఎమ్మెల్యే మత్స్యలింగం



**అరకులోయ, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ మండలంలోని మాడగడ గ్రామ పంచాయతీ, ఏం హట్టగూడ గ్రామాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుపై ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో అరకు స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాల్గొని, ప్రజలతో మమేకమై మాట్లాడారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, గత వైసీపీ ప్రభుత్వంలో అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంచి ఉద్దేశంతో పేదలకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు కార్పొరేట్ తరహాలో అందించాలనే లక్ష్యంతో పేద పిల్లలు విదేశాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్య విద్య అభ్యసించేలా 17 మెడికల్ కాలేజీలు నిర్మించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అరకులోయ వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు స్వాభి రామ్మూర్తి, అరకులోయ మండల జెడ్పీటీసీ శెట్టి రోషిణి, వైసీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి పాంగి చిన్నారావు, అరకులోయ మండల సర్పంచ్ పోరం అధ్యక్షుడు, బస్కి పంచాయితీ సర్పంచ్ పాడి రమేష్, అరకులోయ మండల వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, అరకులోయ మండల సర్పంచ్ పోరం అధ్యక్షురాలు, కొత్తబల్లుగుడ సర్పంచ్, వైసీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా మాజీ అధికార ప్రతినిధి కొర్ర రాధిక, అరకులోయ టౌన్ షిప్ ఎంపీటీసీ దూరియా ఆనంద్, వైసీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి జన్ని నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.ఈ

## బస్సులు నిలుపుదల చేయాలని నిరసన తెలుపుతున్న విద్యార్థులు



**శ్రీకాకుళం, హకం న్యూస్:** బూర్జ మండలం లక్కుపురం కూడలిలో బస్సులు ఆపడం లేదని, దీంతో ఇబ్బం దులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కూడలిలో రోడ్డుపై బైఠా యించి నిరసన తెలిపారు. ఈ కూడలి సమీపంలోని 10 గ్రామాల నుంచి నిత్యం కళాశాలలు, పాఠశాలలకు విద్యార్థులు పాల కొండ, శ్రీకాకుళం, ఆమదాలవలస తదితర ప్రాం తాలకు వెళు తుంటారని, అయితే రిక్వెస్టు స్టాప్ ఉన్నా ఫలితం కనిపిం చడం లేదన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కె.దీప విద్యార్థు లతో మాట్లాడారు. ఇదివరకు అనేక పర్యాయాలు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విద్యార్థు లు ఆగ్రహం వ్యక్తంచేశారు. సమస్యను ఎమ్మెల్యే కూన రవి కుమార్ దృష్టికి తీసుకొని వెళతామన్నారు. విద్యార్థుల ఆందోళ నతో ప్రధానమార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెంటనే ఎస్ఐ ప్రవల్లిక సిబ్బందితో చేరుకొని సమస్య పరిష్కా రానికి కృషి చేస్తానని చెప్పడంతో విద్యార్థినీ విద్యార్థులు శాంతించారు.

## వైసీపీపై బురద చల్లే ప్రయత్నాలు మానుకోండి



**చింతపల్లి, పతాకం న్యూస్:** జనసేన పార్టీ కండువాలు కప్పుకున్న వారు మా పార్టీకి చెందినవారు కాదు. బలపం పంచాయతీలో వైసీపీ నుండి ఎవరు ఇతర పార్టీలకు వెళ్లలేదు, వైసీపీ పై బురద చల్లే ప్రయత్నాలు మానండి అంటూ బలపం పంచాయతీ సర్పంచ్ రమేష్ నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మచ్చమ్మ హితవు పలికారు. వైసీపీలో గుర్తింపు లేకనే జనసేన పార్టీలో చేరినట్లు బలపం పంచాయతీ పరిధిలోని కొంతమంది వ్యక్తులు పత్రికా ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందని బలపం సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు,ఎంపీటీసీ సభ్యురాలు బచ్చల మచ్చమ్మ లు అన్నారు. స్థానిక పత్రిక సమావేశంలో మాట్లాడుతూ ఏనాడు వైసిపి జెండా పట్టని వారు తమ (బలపం) పంచాయితీ లో వైసీపీ నాయకులం అంటూ పార్టీకి మచ్చ తెచ్చే విధంగా ప్రకటన చేయడాన్ని వైసిపి నాయకులమంతా ముక్తకంఠంగా ఖండిస్తున్నామన్నారు. బలపం పంచాయతీలో వైసీపీకి చెందిన ఏ ఒక్కరు పార్టీ మారలేదన్నారు. జనసేన పార్టీ కండువాలు కప్పుకున్న వారంతా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి ఆకర్షితులయ్యే వ్యక్తులని, అటువంటి వ్యక్తులకు పార్టీ జెండాలు కప్పి ఇతర పార్టీలపై బురద చల్లే కార్యక్రమాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బలపం పంచాయతీలో వైసీపీ జెండాఎగురవేయడం ఖాయమని ఈ సందర్భంగా వారు జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమాలలో వారితో పాటు పంచాయతీ వైస్ చైర్మన్ పి కామరాజు, వైసీపీ సీనియర్ నాయకులు జి మోహన్ రావు , పంచాయితీ విభాగ అధ్యక్షులు కే కోటి బాబు, బి బాబురావు, పంచాయతీ ప్రధాన కార్యదర్శులు ఎల్ బాలకృష్ణ, ఏ శ్రీనివాసరావు, యు బుజ్జిబాబు, వార్డ్ సభ్యుడు జి చిట్టిబాబు, వంతల లక్షణ్, పూజారి సుదీర్, పలాసి వరప్రసాద్, కుర్తాడి మోహన్ రావు, పలాసీ సుదర్శన్, వంతల కిరణ్ , రాణికుమారి, రాజమ్మ, సోములమ్మ, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం

**అరకు లోయ, పతాకం న్యూస్:** పాఠశాల విద్యాశాఖ సహకారంతో జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా అరకు లోయ మండల కేంద్రంలో మంగళవారం మండల స్థాయి పోటీలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ చెకుముకి టాలెంట్ టెస్టుల్లో వివిధ పాఠశాలల నుంచి 36 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ శాస్త్రీయ ప్రతిభను కనబరిచారు.పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి భారతి రత్నం, ప్రధానోపాధ్యాయులు టి. మోహన్ రావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. విద్యార్థులు తమ శాస్త్రీయ అవగాహన, ఆవిష్కరణా ప్రతిభ, సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి భారతి రత్నం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి. మోహన్ రావు మాట్లాడుతూ, శాస్త్రవిజ్ఞానం ప్రాముఖ్యతను వివరించారు.

## శ్రీకాకుళం జిల్లాలో మొంథా నష్టం రూ 1.24 కోట్లు



**శ్రీకాకుళం, హకం న్యూస్:** మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాకు తీవ్ర నష్టం వాటిల్లింది. భారీ వర్షాలు, ఈదురుగాలల కారణంగా పలు శాఖలకు సంబంధించి మొత్తంగా రూ.1.24 కోట్లు నష్టం వాటిల్లినట్టు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. అత్యధికంగా ఆర్అండ్‌బీ, విద్యుత్‌శాఖకు నష్టం వాటిల్లినట్టు గుర్తించారు. 2,230.29 హెక్టార్లలో వరి పంట ముంపునకు గురైనట్లు అంచనా వేశారు. దీని నష్టం రూపాయల్లో నిర్ధారించాలంటే.. క్షేత్రస్థాయిలో సర్వే చేసి గణించాల్సి ఉంది. ఎకరాకు 33 శాతం పంట నష్టపోతేనే.. పరిహారం అందజేయనున్నారు. జిల్లాలో పదిహేను మండలాల్లోని 53 గ్రామాల్లో వరితోపాటు ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ఇచ్ఛాపురం మండలం అత్యధికంగా తుఫాన్ ధాటికి గురైంది. ఆ తర్వాత నందిగాం, పాతపట్టణం, టెక్కలి, సోంపేట, లావేరు, జి.సిగడాం, పలాస, మెళియాపుట్టి, వజ్రపుకొత్తూరు, మందస, నరసన్నపేట, కొత్తూరు మండలాల్లో పంటలు పాడయ్యాయి. ఈ ప్రాంతాల్లో ఇటు రోడ్లు.. ఇళ్లకు కూడా నష్టం వాటిల్లింది. శుక్రవారం రాత్రి వరకు 302 హెక్టార్ల మేర అధికారులు సర్వే చేశారు. పంట నష్టాన్ని ప్రభుత్వం తాజాగా రూపొందించిన ఏపీఏఐఎంఎస్ యాప్ 2.0లో వివరాలు పొందుపరిచారు. పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు. ప్రభుత్వం త్వరలో పరిహారం అందజేయనుంది.

## 70వ ప్రజా దర్బార్... 4 వేల మందిని కలిసిన లోకేశ్

(మొదటిపేజీ తరువాయి)



జిల్లాకు చెందిన టీడీపీ కార్యకర్త దనపాన హరికృష్ణ మంత్రి లోకేశ్ కు ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన మెరిగల రవిబాబు, తన వారసత్వ భూమిని వైసీపీ కార్యకర్త కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, పోలీసులు స్పందించడం లేదని వాపోయారు. టీడీపీ సానుభూతిపరుడిననే కారణంతో అతిథి అధ్యాపకుడి ఉద్యోగం నుంచి తొలగించారని కర్నూలు జిల్లాకు చెందిన ఉలిద్ర రవి మంత్రికి తన గోడును వెళ్లబోసుకున్నారు. ఈ ఫిర్యాదులపై విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు కూడా మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న హెల్త్ అసిస్టెంట్ (మేల్) పోస్టులను భర్తీ చేయాలని అన్ ఎంప్లాయిస్ పారా మెడికల్ హెల్త్ అసిస్టెంట్ అసోసియేషన్ కోరింది. ఏపీ జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్స్‌లో పనిచేస్తున్న 23,500 మంది కాంట్రాక్టు కార్మికుల సేవలను క్రమబద్ధీకరించి, వేతన సవరణ చేయాలని ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచు గూడెంలలో కొత్త పాఠశాలలు మంజూరు చేయాలని గిరిజన సంఘం ప్రతినిధులు కోరారు. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానికులు విన్నవించారు. విజయవాడ గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గరిమెళ్ల అనిల్ కుమార్ ఫిర్యాదు చేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తనకు సీఎం సహాయ నిధి ద్వారా వైద్యసాయం అందించాలని చిత్తూరుకు చెందిన ప్రకాశ్ బాబు కోరారు. వచ్చిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

### రూ.3 వేల కోట్లకుపైగా కుంభకోణం

## 'డిజిటల్ అరెస్టు'లపై కఠిన ఆదేశాలిస్తాం : సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ పతాకం న్యూస్:** డిజిటల్ అరెస్టులు ఓ కుంభకోణం స్థాయికి చేరుకున్నాయని, ఇప్పటివరకు భారత్‌లోనే రూ.3వేల కోట్లకు పైగా మొత్తాలను బాధితుల నుండి మోసగాళ్లు కొల్లగొట్టారని సుప్రీంకోర్టు పేర్కొంది. అది కూడా మెజారిటీ సంఖ్యలో వృద్ధులను లక్ష్యంగా చేసుకునే ఇదంతా జరిగిందని, వీటిని అరికట్టే సంస్థల బలోపేతానికి కఠినమైన ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం అందజేసిన విశ్వసనీయమైన నివేదికను ప్రస్తావిస్తూ, జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. డిజిటల్ అరెస్టులనేది చాలా పెద్ద సవాలుగా మారిందని ఈ నివేదికను చూస్తుంటే అర్థమవుతోందని జస్టిస్ కాంత్ వ్యాఖ్యానించారు. మనం అనుకుంటున్న దానికంటే చాలా ఎక్కువగా ఈ సమస్య పాతుకుపోయిందని పేర్కొన్నారు. మోసం జరుగుతున్న తీరు, పరిధి చాలా విస్తృతంగా వుందని నివేదికను చూస్తే తెలుస్తోందన్నారు. ఒక్క భారతదేశంలోనే రూ.3వేల కోట్లకు పైగా మొత్తాలను బాధితుల నుండి వసూలు చేశారంటే ఇక అంతర్జాతీయ స్థాయిలో ఎలా వుంటుందో ఆలోచించుకోవచ్చున్నారు. ఊహించిన దానికన్నా మించి డిజిటల్ అరెస్టు కుంభకోణం స్థాయి వుందని జస్టిస్ కాంత్ వ్యాఖ్యలతో కేంద్రం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఏకీభవించారు. ఇటువంటి మోసగాళ్లకు వ్యతిరేకంగా వ్యవహరించే సంస్థలను మరింత బలోపేతం చేసేందుకు న్యాయ వ్యవస్థ చాలా కఠినమైన ఆదేశాలు జారీ చేస్తుందని, ఇందుకు అందరి మద్దతు కావాలని జస్టిస్ కాంత్ చెప్పారు. మనీ లాండరింగ్ ముఠాలే ఈ సైబర్ నేరాలకు పాల్పడుతున్నాయని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి అన్నారు. కోర్టు, దర్యాప్తు సంస్థల ఫోర్జరీ ఉత్తర్వులను సాకుగా చూపి హర్యానాలోని అంబాలాలో ఒక వృద్ధ జంటను డిజిటల్ అరెస్టు చేసి రూ.1.05 కోట్లకు పైగా కొల్లగొట్టిన ఘటనను సుప్రీంకోర్టు తనకు తానుగా పరిగణనలోకి తీసుకుంది. దేశవ్యాప్తంగా ఇలాంటివి అనేక కేసులున్నాయని తర్వాత న్యాయస్థానానికి తెలియజేస్తూ కేంద్రం ఒక నివేదిక సమర్పించింది. ఈ సమస్య కలిగించే ప్రభావం చాలా ఎక్కువ అని, ఇందులో ఆర్థిక కోణమే కాదని, మానవీయ కోణం కూడా వుందని మెహతా పేర్కొన్నారు. విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం చేసి వారిని బానిసలుగా మారుస్తున్నారన్నారు.

## ఏపీలో ఎర్రచందనం సాగుదారులకు బయోడైవర్సిటీ బోర్డు చేయూత... రూ.3 కోట్ల నిధుల విడుదల



**అమరావతి, పతాకం న్యూస్:** ఎర్రచందనం సాగు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతులకు జాతీయ జీవవైవిధ్య అథారిటీ శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని 198 మంది రైతులు, సాగుదారులతో పాటు ఒక విద్యా సంస్థకు కలిపి మొత్తం రూ. 3 కోట్లను మంగళవారం విడుదల చేసింది. జీవ వనరుల సుస్థిర వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నిధులను పంపిణీ చేసినట్లు ఓ అధికారి తెలిపారు. 'యాక్సెస్ అండ్ బెనిఫిట్-షేరింగ్' ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా ఈ ఆర్థిక సాయాన్ని అందించారు. లబ్ధిదారుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాల్లోని 48 గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు. ఈ నిధుల విడుదలలో ఆంధ్రా యూనివర్సిటీ కూడా ప్రయోజనం పొందింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య బోర్డు ద్వారా ఈ నిధుల పంపిణీ జరిగింది. వినియోగదారులకు సరఫరా చేసిన ఎర్రచందనం కలప పరిమాణాన్ని బట్టి, ఒక్కో రైతుకు రూ. 33,000 నుంచి గరిష్ఠంగా రూ. 22 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనం చేకూరనుంది. కలప అమ్మకం ద్వారా వచ్చిన విలువ కంటే లబ్ధిదారులు అధిక మొత్తంలో ప్రయోజనం పొందుతున్నారని అధికారులు పేర్కొన్నారు. ఎర్రచందనం పరిరక్షణకు, రైతులకు ప్రోత్సాహం అందించేందుకు ఎన్‌బీఏ ఈ చర్యలు చేపట్టింది. గతంలో కూడా ఎన్‌బీఏ భారీగా నిధులను విడుదల చేసింది. ఎర్రచందనం సంరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక అటవీ శాఖలు, ఏపీ రాష్ట్ర జీవవైవిధ్య బోర్డుకు కలిపి రూ. 48 కోట్లు, తమిళనాడు రైతులకు రూ. 55 లక్షలు అందజేసింది. ఎర్రచందనంపై 2015లో ఎన్‌బీఏ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ కమిటీ సూచనల ఫలితంగానే, 2019లో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ సాగు చేసిన ఎర్రచందనం ఎగుమతికి అనుమతిస్తూ విధానపరమైన సడలింపులు ఇచ్చింది. జీవవైవిధ్య పరిరక్షణను లాభదాయకమైన జీవనోపాధిగా మార్చవచ్చని ఈ కార్యక్రమం నిరూపిస్తోందని, స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని అధికారులు వివరించారు.

## నక్సల్స్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ... ఆయుధ కర్మాగారాన్ని ధ్వంసం చేసిన డీఆర్‌జీ బలగాలు

**ఛత్తీస్‌ఘఢ్, పతాకం న్యూస్:** ఛత్తీస్‌ఘఢ్‌లోని మావోయిస్టులకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలోని దట్టమైన అడవుల్లో రహస్యంగా నడుపుతున్న ఆయుధాల తయారీ కర్మాగారాన్ని డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) బలగాలు గుర్తించి ధ్వంసం చేశాయి. ఈ మెరుపుదాడిలో భారీ ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కోయిమెంట-ఎరపల్లి ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు. కొన్ని నెలలుగా మావోయిస్టులు ఈ ఫ్యాక్టరీని అత్యంత రహస్యంగా నిర్వహిస్తున్నారు. సోలార్ ప్యానెళ్ల సహాయంతో నడిచే ఈ వర్క్‌షాప్‌లో ఆయుధాలను తయారు చేస్తున్నట్లు బలగాలు గుర్తించాయి. దాడి సమయంలో సగం తయారైన 17 నాటు తుపాకులు, బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు, పెద్ద మొత్తంలో ఉక్కు రాడ్లు, ట్రిగ్గర్ మెకానిజమ్స్, లేత్ మెషీన్లు, వెల్డింగ్ కిట్లు, డ్రిల్లింగ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు మందుపాతరల తయారీకి సిద్ధంగా ఉంచిన జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, సర్క్యూట్ బోర్డులను కూడా సీజ్ చేశారు. ఈ ఆపరేషన్ వివరాలను సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ మీడియాకు వెల్లడించారు. కొద్ది వారాల క్రితం లొంగిపోయిన మావోయిస్టులు ఇచ్చిన కచ్చితమైన సమాచారంతోనే ఈ స్థావరాన్ని గుర్తించగలిగామని తెలిపారు. ఆ స్థావరంలో ఆర్మీ రైఫిళ్లతో సరితూగే ఆయుధాలను తయారు చేసేందుకు సంబంధించిన బ్లూప్రింట్లను కూడా కనుగొన్నట్లు చెప్పారు.

# అన్నదాతకు అక్కరని రాని పంటల బీమా పథకం



**అమరావతి, పతాకం న్యూస్:** కేంద్ర ప్రభుత్వ పంటల బీమా పథకాలు.. తరచు విపత్తులతో నష్టాలను చవిచూస్తున్న రైతులకు అక్కరకు వచ్చే బదులు ఇన్సూరెన్స్ కంపెనీల ఇష్టారీతి దోపిడీకి బాగా పనికొస్తున్నాయని గడచిన మూడేళ్ల అనుభవాలు కుండబద్దలు కొడుతున్నాయి. ఈ విచ్చలవిడి దోపిడీలో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలదే హవా. కేంద్ర స్కీంలు ఫసల్ బీమా, పునర్వ్యస్థీకరించిన వాతావరణ బీమా పథకాల్లోకి 2022 ఖరీఫ్ నుంచి నాటి వైసిపి ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చేరింది మొదలుకొని టిడిపి కూటమి సర్కార్ తొలి ఏడాది 2024 రబీ వరకు రైతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా కంపెనీలకు దాదాపు రూ.5,860 కోట్లు చెల్లించగా, విపత్తుల బారినపడ్డ రైతులకు ఇప్పటికి చెల్లించిన పరిహారం రూ.930 కోట్లు మాత్రమే. కంపెనీలు రూ.4,930 కోట్లు లాభాలు మూటగట్టుకున్నాయి. వసూలు చేసిన గ్రాస్ ప్రీమియంలో కేవలం 15 శాతమే రైతులకు తిరిగి పరిహారం రూపంలో చెల్లించాయి. గడచిన మూడేళ్లల్లో ఫసల్ బీమా కింద కంపెనీలు రూ.4,294 కోట్లు గ్రాస్ ప్రీమియం వసూలు చేసి రూ.930 కోట్లు రైతులకు పరిహారం చెల్లించాయి. వాతావరణ ఆధారిత బీమా కింద రూ.1,560 కోట్లు ప్రీమియం తీసుకొని రైతులకు ఒక్క రూపాయి కూడా పరిహారం చెల్లించలేదు. మొత్తంగా కంపెనీలు 85 శాతం లాభాలను తమ బక్కసంలో వేసుకున్నాయి. ఇంత భారీ లాభం మరే వ్యాపారంలోనూ ఉండదేమో! కంపెనీలకు చెల్లించే ప్రీమియం సొమ్మును అన్నదాతలకు మళ్లించి నేరుగా సాయం చేస్తే కొంత మేరకైనా నగదు సాయం వారి చేతికందేది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అంతకుముందున్న పంటల బీమా పథకాలను రద్దు చేసి 2016 ఖరీఫ్ నుంచి ఫసల్, వాతావరణ బీమాలను తీసుకురాగా, ఆ సమయంలో ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న టిడిపి ప్రభుత్వం మన రాష్ట్రంలోనూ వాటిని మక్కీమక్కికి అమలు చేసింది. రైతులకు ఆ స్కీముల వలన ప్రయోజనం కలగట్లేదంటూ 2019లో అధికారంలోకొచ్చిన వైసిపి ఆ ఏడాది రబీ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చి కంపెనీలతో ప్రమేయం లేకుండా తానే నిర్వహించింది. తదుపరి కేంద్రం ఒత్తిళ్లతో, 2022 ఖరీఫ్ నుంచి కేంద్ర పథకాల్లో చేరింది. ఆ సంవత్సరం ఫసల్ స్కీము ఒక్కటే కంపెనీల నిర్వహణకు అప్పగించి వాతావరణ బీమాను తానే నిర్వహించింది. 2023 ఖరీఫ్ నుంచి రెండు పథకాలనూ కంపెనీల నిర్వహణకు అప్పగించింది. తొలేడాది ఖరీఫ్‌లోనే ఫసల్ స్కీంలో చెప్పుకోతగ్గ స్థాయిలో రైతులకు పరిహారం అందింది. అటు వైసిపి హయాంలో కానీ నేటి కూటమి ప్రభుత్వంలోకానీ కంపెనీల నుంచి పరిహారం అందింది చాలా తక్కువ. వైసిపి సర్కార్ ప్రీమియం నిధులు సకాలంలో చెల్లించకపోవడం వలన క్లెయిములు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ చెల్లిస్తామన్న కూటమి ప్రభుత్వం తన హామీని పూర్తి స్థాయిలో నిలబెట్టుకోలేదు. పైగా ఉచిత పంటల బీమా ఎత్తేసి రైతులు తమ వాటా ప్రీమియం చెల్లించుకోవాలని నిబంధనలు మార్చడంతో పథకాలు అంతంతమాత్రంగా తయారయ్యాయి. కంపెనీలు రంగప్రవేశం చేశాక 2022 ఖరీఫ్‌లో ఫసల్ బీమాలో 25.28 లక్షల మంది రైతులు చేరితే 3.43 లక్షల మందికి పరిహారం అందింది. ఆ ఏడాది రబీలో 15.22 లక్షల మందికిగాను 64 వేల మందికి, 2023 ఖరీఫ్‌లో 22.68 లక్షల మందికిగాను 98 వేల మందికి, ఆ ఏట రబీలో 12.92 లక్షల మందికిగాను 1.43 లక్షల మందికి కొద్దిపాటి పరిహారం దక్కింది. కూటమి వచ్చాక 2024 ఖరీఫ్‌లో ఉచిత పంటల బీమా అమలు చేశారు. ఆ సీజన్‌లో 24.05 లక్షల మంది రైతులు ఫసల్ బీమాలో చేరగా 82 వేల మందికి 8.53 కోట్ల పరిహారం అందింది.

ఆ సంవత్సరం రబీ నుంచి ఉచిత బీమా ఎత్తేశారు. అప్పుడు 2.91 లక్షల మంది రైతులు పథకంలో చేరగా ఒక్క క్లెయిము కూడా సెటిల్ కాలేదు. 2023 ఖరీఫ్ నుంచి వాతావరణ బీమా నిర్వహణ కంపెనీల చేతుల్లోకి వెళ్లింది. ఆ సీజన్‌లో వెదర్ బేస్డ్ స్కీంలో 7.40 లక్షల మంది రైతులు చేరారు. వందల కోట్ల ప్రీమియం కంపెనీల గల్లా పెట్టెల్లో పడగా ఒక్క రూపాయి అయినా రైతులకు చెల్లించలేదు. 2023 రబీలో 1.92 లక్షల మంది రైతులు, కూటమి సర్కార్ వచ్చాక 2024 ఖరీఫ్‌లో 8 లక్షల మంది, ఆ ఏడాది రబీలో 15 వేల మంది వాతావరణ బీమా పథకంలో నమోదుకాగా ఒక్క రూపాయి కూడా రైతులకు ఇవ్వలేదు. ఈ కాలంలో విపత్తులు లేవా అంటే అదేమీకాదు. తుపాన్లు, భారీవర్షాలు, వరదలు, కరువులతో రైతులకు భారీగా పంట నష్టం వాటిల్లినా కంపెనీలు రైతులకు పరిహారం ఇవ్వలేదు.

## మరింత దిగొచ్చిన బంగారం ధరలు



**ముంబై:** బంగారం ధరలు మంగళవారం భారీగా తగ్గుముఖం పట్టాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం, అంతర్జాతీయంగా అమెరికా డాలర్ బలపడటం వంటి పరిణామాలు పసిడి ధరలపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో పాటు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు బలహీనపడటం కూడా బంగారం పతనానికి దారితీసింది. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ వెల్లడించిన వివరాల ప్రకారం, మధ్యాహ్నం 12:30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,19,916గా నమోదైంది. మరోవైపు, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.836 (0.69 శాతం) తగ్గి 10 గ్రాములకు రూ.1,20,573 వద్ద ట్రేడ్ అయింది. ఇదే సమయంలో డాలర్ ఇండెక్స్ 0.08 శాతం పెరిగి 99.95 వద్ద స్థిరంగా కొనసాగింది. బలమైన డాలర్, అమెరికా-చైనా మధ్య తగ్గుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు, అమెరికాలో వడ్డీ రేట్ల కోతకు అవకాశాలు తగ్గడం వంటి అంశాలు బంగారం ఆకర్షణను దెబ్బతీశాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనలిస్ట్ మానవ్ మోదీ మాట్లాడుతూ, "డాలర్ మూడు నెలల గరిష్ఠ స్థాయికి చేరడంతో బంగారం ధర ఔన్సుకు 4,000 డాలర్ల వద్ద కదలాడుతోంది. అమెరికా ఫెడరల్ ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా కీలక ఆర్థిక గణాంకాలు అందుబాటులో లేకపోవడంతో, డిసెంబర్ పాలసీ సమావేశం ముందు ఫెడ్ అధికారుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి" అని వివరించారు. మరోవైపు, ప్రపంచంలోనే అతిపెద్ద బంగారం వినియోగదారు అయిన చైనా, కొన్ని గోల్డ్ రిటైలర్లకు చాలాకాలంగా ఇస్తున్న పన్ను మినహాయింపు విధానాన్ని రద్దు చేసింది. ఇది అక్కడి బంగారం కొనుగోళ్ల జోరుకు కళ్లెం వేసే అవకాశం ఉంది. అయితే, వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజా నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు 2025 మూడో త్రైమాసికంలో బంగారం కొనుగోళ్లను త్రైమాసిక ప్రాతిపదికన 28 శాతం పెంచాయి.

## అనిల్ అంబానీకి గట్టి ఎదురు దెబ్బ..రూ.4,462 కోట్ల విలువైన భూములు అటాచ్ చేసిన ఈడీ



రూ.4,462 కోట్ల విలువైన భూములు అటాచ్ చేసిన ఈడీప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక చర్యలు తీసుకుంది. మహారాష్ట్రలోని నవీ ముంబైలో ఉన్న ధీరూభాయ్ అంబానీ నాలెడ్జ్ సిటీలో సుమారు 132 ఎకరాల భూమిని తాత్కాలికంగా అటాచ్ చేసింది. దీని విలువ రూ.4,462.81 కోట్లు ఉంటుందని ఈడీ ఒక ప్రకటనలో వెల్లడించింది. బ్యాంకు మోసం కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం నిబంధనల కింద ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపింది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్), రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లకు సంబంధించిన బ్యాంకు మోసం కేసులపై ఈడీ కొంతకాలంగా దర్యాప్తు చేస్తోంది. గతంలోనే ఈ కేసులకు సంబంధించి రూ.3,083 కోట్లకు పైగా విలువైన 42 ఆస్తులను జప్తు చేసింది. తాజా అటాచ్‌మెంట్‌తో కలిపి ఈ కేసుల్లో ఇప్పటివరకు జప్తు చేసిన మొత్తం ఆస్తుల విలువ రూ.7,545 కోట్లకు పైగా చేరింది. ఆర్‌కామ్, అనిల్ అంబానీ, ఇతరులపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ దర్యాప్తును ప్రారంభించింది. 2010-12 మధ్య కాలం నుంచి ఆర్‌కామ్, దాని గ్రూప్ కంపెనీలు దేశీయ, విదేశీ బ్యాంకుల నుంచి భారీగా రుణాలు తీసుకున్నాయి. ప్రస్తుతం ఈ కంపెనీలు బ్యాంకులకు రూ.40,185 కోట్లు బకాయిపడ్డాయని, ఐదు బ్యాంకులు ఇప్పటికే ఈ రుణ ఖాతాలను మోసపూరితంగా (ఫ్రాడ్) ప్రకటించాయని ఈడీ పేర్కొంది. ఈడీ దర్యాప్తులో ఆర్‌కామ్ నిధుల మళ్లింపునకు పాల్పడినట్లు తేలింది. ఒక బ్యాంకు నుంచి తీసుకున్న రుణాన్ని, మరో బ్యాంకులో ఉన్న ఇతర కంపెనీల రుణాలను తీర్చేందుకు (ఎవర్‌గ్రీనింగ్) ఉపయోగించినట్లు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా రూ.13,600 కోట్లను ఇతర రుణాల చెల్లింపులకు, రూ.12,600 కోట్లను అనుబంధ సంస్థలకు మళ్లించినట్లు కనుగొన్నారు. మరో రూ.1,800 కోట్లను మ్యూచువల్ ఫండ్స్, ఎఫ్‌డీలలో పెట్టుబడి పెట్టి, ఆ తర్వాత వాటిని తిరిగి గ్రూప్ సంస్థలకే మళ్లించినట్టు దర్యాప్తులో వెల్లడైంది. బిల్ డిస్కౌంటింగ్ విధానాన్ని దుర్వినియోగం చేసి నిధులను అనుబంధ పార్టీలకు తరలించడంతో పాటు, కొన్ని రుణాలను విదేశాలకు కూడా పంపినట్లు ఆధారాలు లభించాయని ఈడీ తెలిపింది. ఈ కేసులో దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని తన ప్రకటనలో స్పష్టం చేసింది.

# ‘మైగ్రెయిన్’ వేధిస్తోందా?



నిద్ర చాలనప్పుడు, పని ఒత్తిడి ఎక్కువైనప్పుడు తలనొప్పిగా అనిపించడం మామూలే. ఇలాంటప్పుడు ఒక కప్పు టీ లేదా కాఫీ తాగితే వెంటనే తలనొప్పి తగ్గిపోతుంది. కానీ, మైగ్రెయిన్ అనే తలనొప్పి మాత్రం తలలో నరాలు చిట్లిపోతున్నాయా? ఎవరైనా సుత్తులతో బాదుతున్నారా? అన్నంతగా వేధిస్తుంది. సాధారణంగా ఈ మైగ్రెయిన్ అనేది ఎక్కువ మహిళల్లో కనిపిస్తుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మైగ్రెయిన్ ఉన్నవారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం!

మైగ్రెయిన్ తలలో ఒకవైపు మాత్రమే వేధించే ఒక రకమైన తలనొప్పి. ఇది మొదలైనప్పుడు తలలో నరాలు చిట్టిపోతున్నంతగా నొప్పి వేధిస్తుంటుంది. దీని లక్షణాలు సాధారణంగా ఉదయం నిద్ర నుంచి మేల్కొన్నప్పుడు వస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇది తేలికపాటి తలనొప్పితో ప్రారంభమై, తీవ్రమైన తలనొప్పిగా వస్తుందంటున్నారు. ఇది తరచూ వికారం, వాంతులు లాంటి లక్షణాలు ఉంటాయని, అధిక వెలుతురు, శబ్దాలను భరించలేరని అధ్యయనం పేర్కొంది. ముఖంలో ఒక భాగంలో కానీ, కాళ్లు, చేతుల్లో తిమ్మిరిగా లేదా సూదులతో గుచ్చినట్లుగా అనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా, కళ్లు తిరిగినట్లు, బలహీనత, మాట్లాడటానికి కాస్త ఇబ్బంది పడుతుంటారని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో మహిళల్లో నెలసరికి ముందు, నెలసరి రోజుల్లో మైగ్రెయిన్ బాధలు అధికంగా ఉంటాయంటున్నారు.

ఒత్తిడి, ఆహారం, నిద్రలేమి, జన్యుపరమైన కారణాలు వల్ల మైగ్రెయిన్ వస్తుంది. ఇది ఎక్కువగా 18 నుంచి 40 ఏళ్ల వారికి అధికంగా వస్తుంటుంది. పురుషులతో పోలిస్తే మహిళలకు ఈ మైగ్రెయిన్ వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంటుంది. హార్మోన్లలో హెచ్చుతగ్గులు మైగ్రేన్‌కు దారితీయవచ్చు. మైగ్రెయిన్ అనేది పేషంట్ తలనొప్పి లక్షణాలు బట్టే డయాగ్నోసిస్ అనేది తెలిసిపోతుంది. మైగ్రెయిన్ వాళ్లకి సిటీ స్కాన్, ఎంఆర్?ఐ స్కాన్ అనేది నార్మల్?గా ఉంటాయి. వాళ్లకి ఈ టెస్ట్?లు చేయించినప్పుడు మేజర్ చేంజెస్ ఉండవు. కొంతమందికి ఎంఆర్?ఐలో చిన్న చిన్న రక్తనాళాల్లో కొన్ని రకాల మార్పులు కనిపిస్తాయి. మైగ్రెయిన్ వచ్చే విధానాన్ని బట్టి చికిత్స ఉంటుంది. - డా.మురళి, న్యూరాలజిస్ట్

మైగ్రెయిన్‌కు కొన్ని ప్రత్యేకమైన కారణాలు ప్రేరేపకాలుగా పనిచేస్తుంటాయని నిపుణులు చెబుతున్నారు. మానసిక ఒత్తిడి, అధిక శ్రమ, ప్రకాశవంతమైన వెలుతురు, నెలసరిలో తేడాలు, గర్భ నిరోధక మాత్రలు, మత్తుపానీయాలు, ధూమపానం అలవాట్లు ఇవన్నీ మైగ్రెయిన్?ను ప్రేరేపిస్తాయంటున్నారు. మైగ్రెయిన్?లో తలకు ఒకవైపు వెళ్లే నరాలు అకస్మాత్తుగా సంకోచ, వ్యాకోచాలకు లోను కావడంతో తలలో నొప్పి మొదలవుతుందని వివరిస్తున్నారు.

మైగ్రెయిన్‌లో కామన్, క్లాసికల్ అనే రెండు రకాల తలనొప్పులు కనిపిస్తాయని నిపుణలు చెబుతున్నారు. కామన్ మైగ్రెయిన్ అనేది తలలో రెండు వైపులా నొప్పి బాధిస్తుందని, ఇది ఎక్కువగా మహిళల్లో ఎక్కువగా వస్తుంటుందని తెలియజేస్తున్నారు. అంతేకాకుండా, కళ్లల్లో సూదులతో గుచ్చుతున్నట్లుగా నొప్పి ఉంటుందని, ఎక్కువగా కంటి వెనుక భాగంలో ఈ నొప్పి ఉంటుందని వివరిస్తున్నారు. క్లాసికల్ మైగ్రెయిన్?లో తలనొప్పి ఒక పక్క చెవిపైన మొదలై మొత్తం సగభాగానికి పాకుతుందంటున్నారు. ఒకసారి కుడివైపు కలిగితే, మరొకసారి ఎడమవైపు రావొచ్చని చెబుతున్నారు. మన జనాభాలో సుమారు 10 శాతం మంది మైగ్రెయిన్ బాధితులు ఉన్నారని పలు అధ్యయనాల్లో వెల్లడైంది.

చికిత్స : మైగ్రెయిన్?కి రెండు రకాలుగా చికిత్స ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మొదటి రకం చికిత్సలో తక్షణం నొప్పిని నివారించే మందులను ఇస్తుంటారని తెలియజేస్తున్నారు. రెండో రకం చికిత్సలో, మైగ్రెయిన్ మళ్లీ మళ్లీ రాకుండా ఉండేందుకు దీర్ఘకాలికంగా పనిచేసే మందులను సూచిస్తుంటారు.

జాగ్రత్తలు : మైగ్రెయిన్ నివారించుకోవడానికి జీవనశైలిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, తగినంత నిద్రపోవడం, ప్రతి రోజు ఒకే సమయానికి పడుకోవడం, బరువు నియంత్రణలో ఉండాలని %ఎవసశ్రీఱఅవజాశ్రీబం% అధ్యయనం పేర్కొంది. ఈ క్రమంలో నిత్యం ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళనలు తట్టుకునేందుకు యోగ, ధ్యానం ప్రాణాయామాలని ఆచరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లుకు దూరంగా ఉండాలని సలహా ఇస్తున్నారు.

తక్కువ మొత్తంలో, కెఫిన్ మాత్రమే ప్రారంభ దశలో మైగ్రెయిన్ నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తుంది, తల లేదా మెడకు వేడి లేదా చల్లని కంప్రెస్‌లను వాడండి.

చీకటిగా, నిశ్శబ్దంగా ఉన్న గదిలో విశ్రాంతి తీసుకోండి.

# చుండ్రును ఎలా తొలగించాలి



చుండ్రు.. జుట్టుకి సంబంధించిన సమస్య చాలా మందిని తెగ ఇబ్బంది పెట్టేస్తుంటుంది. ఇది చూడ్డానికి చిన్న సమస్యే అయినా.. తీనికి అనుగుణంగా మరికొన్ని సమస్యలు వచ్చేస్తుంటాయి. దురద, హెయిర్ లాస్ ఇది తీవ్రమైతే కాస్తా కిందకి చేరి మొటిమలు కూడా ఏర్పడతాయి. ఇంత తీవ్రంగా కాకముందే ఈ డాండ్రఫ్‌ని తగ్గించుకోవడం మంచిది. ఇందుకోసం కొన్ని ఇంటి చిట్కాలను చూసేద్దాం.. చుండ్రు.. జుట్టుకి సంబంధించిన సమస్య చాలా మందిని తెగ ఇబ్బంది పెట్టేస్తుంటుంది. ఇది చూడ్డానికి చిన్న సమస్యే అయినా.. తీనికి అనుగుణంగా మరికొన్ని సమస్యలు వచ్చేస్తుంటాయి. దురద, హెయిర్ లాస్ ఇది తీవ్రమైతే కాస్తా కిందకి చేరి మొటిమలు కూడా ఏర్పడతాయి. ఇంత తీవ్రంగా కాకముందే ఈ డాండ్రఫ్‌ని తగ్గించుకోవడం మంచిది. ఇందుకోసం కొన్ని ఇంటి చిట్కాలను చూసేద్దాం.. చుండ్రు సమస్యని పోగొట్టుకోవాలంటే ముందుగా జుట్టుని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. అందుకే వారానికి రెండు లేదా మూడు సార్లు తలస్నానం చేస్తుండాలి. లేకపోతే జుట్టులో తేమ చేరి అది చుండ్రుకి కారణం అవుతుంది. కాబట్టి తలస్నానం చేస్తుండాలి.అదే విధంగా తలను కొంతమంది కప్పి ఉంచుతుంటారు. కానీ, ఇలా కేవలం బయటికి వెళ్లినప్పుడు, పొల్యూషన్‌లో ఉన్నప్పుడు మాత్రమే చేయాలి. ఎప్పుడూ చేయడం వల్ల తలలో తేమ శాతం పెరుగుతుంది. జిడ్డుగా మారి చుండ్రు సమస్య పెరుగుతుంది. దీన్ని తర్వాత ఎంత షాంపూ చేసినా, కండీషనర్ రాసినా సమస్య తగ్గదు. కాబట్టి అప్పుడప్పుడూ తలకి గాలి తగిలేలా చూసుకోండి. దీని వల్ల జుట్టు పొడిగా ఉంటుంది. ఇక మరో ముఖ్య విషయం ఏంటంటే.. చాలా మంది కూడా ఇంట్లో అందరూ ఒకే దువ్వెనతో తల దువ్వుకుంటారు. కానీ, ఇలా చేయడం అంత మంచిది కాదు.. ఎవరికీ వారు సెపరేట్ దువ్వెనలు వాడండి. ఎందుకంటే కొన్ని సార్లు ఒకరి తలలో ఉండె ఇన్‌ఫెక్షన్స్, వైరస్‌లు దువ్వెనల ద్వారా ఇతరలకు వ్యాపిస్తాయి. కాబట్టి ఎవరికీ వారు వేర్వేరుగా దువ్వెనలు వాడడం అలవాటు చేసుకోవడం మంచిది. అదే విధంగా.. టవల్స్ కూడా సెపరేట్‌గా ఉండడం మంచిది. దీని వల్ల సమస్య త్వరగా తగ్గుతుంది.కాసింత బేకింగ్ సోడాని తీసుకుని తడి జుట్టుకి బాగా రాయాలి.. ఇలా రెండు నిమిషాల పాటు బాగా మర్దనా చేసి ఆ తర్వాత తలస్నానం చేయాలి. ఇలా 15 రోజులకి ఓసారి చేయడం వల్ల చుండ్ర సమస్య తగ్గిపోతుంది. అయితే, మరీ ఎక్కువగా బేకింగ్ సోడాను వాడొద్దు. కాసింత పరిమాణంలోనే తీనుకోవడం మంచిది. వెనిగర్‌తోనూ ఈ సమస్యని తగ్గించు కోవచ్చు. అందుకోసం ఆరు చెంచాల నీటిలో 2 చెంచాల వెనిగర్ కలిపాలి. ఇప్పుడు షాంపూతో తలస్నానం చేశాక ఆ నీటితో తలని కడగాలి. వారానికి ఓ సారి ఇలా చేయడం వల్ల త్వరలోనే చుండ్రు సమస్య తగ్గిపోతుంది.పుల్లగా ఉండే పెరుగులో నిమ్మరసంలు కలిపి తలకు రాయాలి. ఆరాక తలస్నానం చేయాలి. ఇలా రెగ్యులర్‌గా చేస్తుంటే తలలోని చుండ్రు దూరమవ్వడమే కాకుండా జుట్టు కూడా కాంతులీనుతూ ఉంటుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌తో కూడా చుండ్రు సమస్యని తగ్గించుకోవచ్చు. రెండు స్పూన్ల యాపిల్ సిడర్ వెనిగర్‌ని షాంపూ లేదా కొబ్బరినూనెలో కలిపి రాయాలి. ఇలా చేసిన తర్వాత ఇబ్బంది లేదనుకుంటే రాత్రంతా ఉంచేసుకోవచ్చు. లేదా అరగంట తర్వాత తలస్నానం చేసేయొచ్చు. ఈ రెమిడీ కూడా డాండ్రఫ్‌ని పోగొట్టడంలో భేషుగ్గా పనిచేస్తుంది.జుట్టు సమస్యలకు మరో మంచి పరిష్కారం ఉసిరి.. ఉసిరి పొడి, ఉసిరి రసంను ఏదైనా స ం అందంలో కాసింత నిమ్మరసం కలిపి రాయాలి. ఆరిన తర్వాత తలస్నానం చేస్తే జుట్టు సమస్యలు చాలా వరకూ దూరం అవుతాయి. కాబట్టి రెగ్యులర్‌గా ఈ రెమిడీని వాడొచ్చు. తీసుకునే ఆహారంలోనూ పీచు పదార్థాలు, విటమిన్ ఎ, ప్రోటీన్స్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఆకుకూరలు, కాయగూరలు, చేపలు ఎక్కువగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటే కేవలం చుండ్రు సమస్య మాత్రమే కాదు జుట్టు సమస్యలు కూడా చాలా వరకూ తగ్గుతాయి. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తగ్గించండి.. జంక్ ఫుడ్, చక్కెర ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోకపోవడం మంచిది. అధికంగా మద్యం సేవించినా చుండ్రు వస్తుందని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. కాబట్టి సమస్యని తగ్గించుకోవాలనుకునేవారు వీటికి దూరంగా ఉండడం మంచిది.

## కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో..

# అన్నవరం గిరిప్రదక్షిణపై ప్రభుత్వం దృష్టి



**అన్నవరం, పతాకం న్యూస్:** కార్తీకపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని ఈనెల 5న సత్యదేవుడి గిరిప్రదక్షిణ నిర్వహణ, జాగ్రత్తలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇటీవల కాశీబుగ్గ ప్రమాద ఘటన నేపథ్యంలో అప్రమత్తతపై అన్న వరం దేవస్థానం అధికారులకు దేవదాయ శాఖ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలిచ్చారు. అలాగే డిప్యూ టీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో కాకినాడ జి ల్లా ఎస్పీ బిందుమాధవ్ గిరిపద్రక్షిణ జరిగే సు మారు 11 కిలోమీటర్ల దూరాన్ని, భక్తులకు కల్పిం చే ఏర్పాట్లను సోమవారం సాయంత్రం పరిశీలించారు. దేవదాయ కమిషనర్ వీడియో కాన్ఫరె న్స్‌లో మాట్లాడుతూ గిరిప్రదక్షిణకు సుమారు 2లక్షల మంది భక్తులు వస్తారని అంచనా ఉ ందని ఉదయం 8గంటలకు పల్లకీసేవ, మధ్యా హ్నం 2గంటలకు సత్యరథంతో గిరియాత్ర జరు గుతుందన్నారు. ఎక్కడా తోపులాటలకు ఆస్కా రం లేకుండా రోప్‌పార్టీ ఉండాలని, 2 సమయాల్లో గిరిప్రదక్షిణ జరుగుతుందని విస్తృత ప్రచారం చేయాలని దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ సూచించారు. భక్తులు ఎక్కడా వెయిటింగ్ లేకుండా నిరంతరాయంగా నడక కొనసాగేలా చేయాలని, ఒకేచోట భక్తజనం గుమికూడకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఇప్పటికే దేవదాయశాఖ ముగ్గురు ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించగా గిరిపద్రక్షిణ ఫెస్టివల్ అధికారిగా రీజనల్ జాయింట్ కమిషనర్ వి.త్రినాధరావును నియమించారు.

గిరి పద్ర క్షిణ అనంతరం కార్తీకమాసం మిగిలిన పర్వ దినాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయలని సూచించారు. అనంతరం వీడియో కాన్ఫెరెన్సలో వెల్లడించిన అంశాలపై ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ సిబ్బందితో సమావేశంలో వెల్లడించి కమిషనర్ ఆదేశాలకణుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధానంగా రూ.1500, 2000 వ్రతమండపాల వద్ద వెయిటింగ్ అధికంగా ఉంటుందని పరిస్థితులుకు అనుగుణంగా వ్రతం టిక్కెట్ల విక్రయాలు చేపట్టాలని సూచిం చారు. కార్తీక పౌర్ణమి రోజున సు మారు 15వేల వ్రతాలు జరుగు తాయని అంచనా వేస్తూ ఏర్పా ట్లు, సిబ్బంది ఉండాలని తెలిపారు.

డిప్యూటీ సీఎం ఆదేశాలతో కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ గిరిపద్రక్షిణ జరిగే సుమారు 11 కిలోమీటర్ల దారిని పరి శీలించారు. స్టాల్స్ ఏర్పాటు, మహిళలకు తాత్కాలిక మరు గుదొడ్ల తదితర వివరాలను దేవస్థానం అధికారులు వివరించగా ఆయన పలు సూచనలు చేశారు. పోలీస్ యంత్రాంగం అంతా చాలా అప్రమత్తంగా బాధ్యతతో వ్యవహరించాలన్నా రు. నిర్లక్ష్యం ప్రదర్శించకుండా పర్యవేక్షణ జరగాలని డీ ఎస్పీ, సీఐలకు సూచించారు. కార్తీకమాసం పూర్తయ్యేవరకు భక్తులు అధికంగా వచ్చే పర్వదినాల్లో భద్రతాచర్యలు, గస్తీ ముమ్మరంగా ఉండాలని సూచించారు.

## అణు పరీక్షలు చేస్తాం: ట్రంప్



**వాషింగ్టన్:** ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేసే అణ్వాయుధాలు అమెరికా వద్ద ఉన్నాయని స్వయంగా ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక నుండి అమెరికా అణ్వాయుధాలను పరీక్షిస్తుందని, చాలా దేశాలు అణు పరీక్షలు చేస్తున్నాయని అన్నారు. తమ వద్ద అత్యుత్తమమైన అణ్వాయుధాలున్నాయని, అయినా పెంచుకోవల్సిన అవసరం ఉందని అన్నారు. అవి ఎలా పని చేస్తున్నాయో పరీక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. చైనా, రష్యా, ఉత్తర కొరియా దేశాల వద్ద కూడా అణ్వాయుధాలున్నాయని, కాని వారు బయటకు చెప్పరని అన్నారు.గత 30 సంవత్సరాల నుండి ఎటువంటి పరీక్షలు అమెరికా చేయలేదన్నారు. వారు అణు పరీక్షలు చేస్తునప్పుడు అమెరికా ఎందుకు చేయని దేశంగా ఉండాలని అన్నారు. ఆ దేశాలు రహస్యంగా భూగర్భంలో పరీక్షిస్తారు వాటి గురించి ప్రపంచానికి తెలియదని చెప్పుకొచ్చారు.పుతిన్, జిన్‌పింగ్ చాలా కఠినాత్ములు, బలమైన నాయకులు, తీవ్రంగా పరిగణించాల్సిన వ్యక్తులు అని వ్యాఖ్యానించారు. చైనాతో వాణిజ్య ఒప్పందం కుదిరింది కదా అని ఇంటర్వ్యూ చేస్తున్న జర్నలిస్టు ప్రశ్నించగా ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. 'మేము చైనాని ఓ కంట కనిపెడతాం. వారు అమెరికాను ఎల్లప్పుడూ కనిపెడ్తూ ఉంటారని అన్నారు. గత 8 నెలల కాలంలో 8 యుద్ధాలను ఆపానని, భారత్, పాక్‌ల మధ్య అణుయుద్ధాన్ని నివారించానని మరోసారి వ్యాఖ్యానించారు.

న్యూయార్క్ మేయర్ ఎన్నికల ఫలితాలు కొద్ది గంటల్లో వెలువడనున్న నేపథ్యంలో ట్రంప్ డెమొక్రాట్స్ సోషలిస్టు అభ్యర్థి జోహ్రాన్ మమ్దానిపై విమర్శలు చేశారు. అతను సోషలిస్టు కాదు, కమ్యూనిస్టు అని అన్నారు. 'మమ్దాని గెలిస్తే అధ్యక్షుడిగా నేనే నిధులు కేటాయించను. ఎందుకంటే న్యూయర్క్‌ను నడిపించేది కమ్యూనిస్టు అయినప్పుడు పంపించడం వృథా' అని అక్కసు వెళ్లగక్కారు. డెమొక్రాట్స్‌లో చెడ్డవారు, కమ్యూనిస్టులు ఉంటే నేను చెడ్డవారి పక్కనే నిలబడతానని మరో మేయర్ అభ్యర్థి క్యూమోను ఉద్దేశించి ట్రంప్ పేర్కొన్నారు.




## మేం ప్రపంచ కప్ ఆడితే రూ.వెయ్యి ఇచ్చారు: మిథాలీ రాజ్



'మహిళల వన్డే ప్రపంచ కప్ 2003 ఫైనల్ ఆడినప్పుడు ఒక్క మ్యాచ్‌కు రూ.వెయ్యి ఇచ్చారు. ఆ టోర్నీలో ఎనిమిది మ్యాచ్‌లు ఆడితే ఒక్కో ప్లేయర్‌కు రూ.8వేలు వచ్చాయి. అప్పట్లో మహిళల క్రికెట్ పరిస్థితి దయనీయంగా ఉండేది. మ్యాచ్ ఫీజులు, జీతాలు వంటివి క్రికెటర్లకు లేవు' అని మిథాలీ ఓ షోలో వెల్లడించింది. తాజాగా మిథాలీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. 2006 వరకు భారత మహిళల క్రికెట్ బీసీసీఐ పరిధిలో లేదు. దాంతో మ్యాచ్‌లు ఆడేందుకు స్పాన్సర్ల కోసం వెతుక్కునేవారు. విరాళాల సాయంతో మ్యాచ్‌లు ఆడేవారు. భారత మహిళా క్రికెట్ అసోసియేషన్.. టీమిండియా జట్టును పర్యవేక్షించేది. 2006లో భారత మహిళా జట్టు బీసీసీఐలో అధికారికంగా వీలినమైంది. అయినా మహిళా క్రికెటర్లపై చిన్నచూపు ఉండేది. మహిళల మ్యాచ్‌లు ప్రత్యక్షంగా ప్రసారం కూడా చేసేవారు కాదు. 2017 ప్రపంచ కప్‌లో చివరి మెట్టు వరకు వచ్చి టీమిండియా ఓటమి పాలైంది. కానీ మహిళలు అద్భుత ప్రదర్శన చేశారు. అదే వారికి టర్నింగ్ పాయింట్ అయింది. గంగూలీ బీసీసీఐ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మహిళా క్రికెట్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాడు. మహిళల దేశవాళీ క్రికెట్‌ను పటిష్టం చేయడంతో పాటు సమాన వేతనాలు ఇవ్వడం ప్రారంభించాడు. బీసీసీఐ సెక్రటరీగా ఉన్న జైషా.. ఐపీఎల్ తరహాలోనే డబ్ల్యూపీఎల్ నిర్వహించాడు. దీంతో మహిళా క్రికెటర్ల రాతే మారిపోయింది. వారి ప్రతిభను దేశమంతా చూసింది.

# హర్మన్ ప్రీత్ ఆస్తులు ఎంతో తెలుసా?



భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ తన 36 ఏళ్ల వయస్సులో వన్డే ప్రపంచ కప్‌ను అందుకుంది. హర్మన్ నాయకత్వంలో సౌతాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించింది. అయితే మైదానంలో పరుగుల వర్షం కురిపించే హర్మన్ రూ.కోట్లు పోగేస్తుంది.

2024-2025లో హర్మన్ నికర విలువ దాదాపు రూ.25కోట్లు ఉంటుందని అంచనా. ఈ భారీ ఆదాయం కేవలం క్రికెట్ మ్యాచ్‌ల నుంచి మాత్రమే కాకుండా ఎండార్స్‌మెంట్‌లు, బ్రాండ్ ఒప్పందాలు, లీగ్ క్రికెట్ నుంచి కూడా వస్తుంది. హర్మన్ బీసీసీఐ (%దీజజ×%)లో అత్యున్నతమైన గ్రేడ్ ఏ ప్లేయర్‌గా ఉంది. ఈ విభాగంలో ఆటగాళ్లకు సంవత్సరానికి రూ.50లక్షల స్థిర జీతం అందుతుంది. దాంతో పాటు, టెస్ట్ మ్యాచ్‌కు రూ.15లక్షలు, వన్డే మ్యాచ్‌కు రూ.6లక్షలు, టీ20 మ్యాచ్‌కు రూ.3లక్షలు తీసుకుంటుంది.

హర్మన్‌ప్రీత్ కౌర్ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్) కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ లీగ్ నుంచి ఆమె ప్రతి సీజన్‌కు సుమారు రూ.1.80 కోట్లు అందుకుంటుంది. విదేశీ లీగ్‌లు, ఎగ్జిబిషన్ మ్యాచ్‌లలో ఆడటం ద్వారా ఆమె అదనపు ఆదాయాన్ని కూడా పొందుతూ దేశంలో అత్యధిక పారితోషికం పొందే మహిళా క్రికెటర్లలో ఒకరిగా నిలిచింది.

హర్మన్‌ప్రీత్ ఎన్నో బ్రాండ్లకు ప్రచారకర్తగా ఉన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, పూమా, బూస్ట్, టాటా సఫారీ, , ఏషియన్ పెయింట్స్ సహా పలు ఎస్టేట్ కంపెనీలు ఉన్నాయి. ఆమె ఒక్కో బ్రాండ్ డీల్‌కు సంవత్సరం రూ.10-12 లక్షల సంపాదిస్తుంది. ఈ బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌ల ద్వారా ఆమె మొత్తం వార్షిక ఆదాయం సుమారు రూ.40-50 లక్షల వరకు ఉంటుంది.

హర్మన్‌ప్రీత్‌కు ముంబై, పంజాబ్‌లోని పాటియాలాలో విలాసవంతమైన ఇళ్లు ఉన్నాయి. అలాగే ఆమెకు వింటేజ్ జీప్‌లతో పాటు హార్లే-డేవిడ్సన్ బైక్‌లు వంటి ఖరీదైన వాహనాల కలెక్షన్ కూడా ఉంది. పాటియాలాలోని ఆమె బంగ్లాను 'హర్మన్‌ప్రీత్ కౌర్ పాటియాలా హౌస్' అని పిలుస్తారు. మైదానంలో ఆటతో దేశం మనసు గెలిచిన హర్మన్‌ప్రీత్, ఆర్థికంగానూ యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.




## 7న విడుదల కానున్న రష్మిక మందన్న
# 'ది గర్ల్‌ఫ్రెండ్'



సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుగ్గా ఉండే ప్రముఖ నటి రష్మిక మందన్న, ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించారు. 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో భాగంగా ఫ్యాన్స్ అడిగిన పలు ప్రశ్నలకు ఓపికగా, ఆసక్తికరంగా సమాధానాలిచ్చారు. ఈ క్రమంలో ఓ అభిమాని అడిగిన ప్రశ్నకు ఆమె ఇచ్చిన జవాబు ఇప్పుడు వైరల్‌గా మారింది. "కాస్త తొందరగానే అడిగేస్తున్నా.. రాబోయే 400–500 ఏళ్ల పాటు నా వాలెంటైన్‌గా ఉంటారా?" అని ఓ నెటిజన్ రష్మికను ప్రశ్నించాడు. ఈ ఊహించని ప్రపోజల్‌కు రష్మిక అంతే చమత్కారంగా స్పందించారు. "ఈ 100 సంవత్సరాల తర్వాత కూడా మనం ఇదే జన్మలో బతికి ఉంటే.. అప్పుడు తప్పకుండా ఉందాం" అంటూ నవ్వుతూ, హృదయం ఎమోజీని జోడించి సమాధానమిచ్చారు.

ఇదే సెషన్‌లో తన తదుపరి చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' షూటింగ్ అనుభవాల గురించి కూడా పంచుకున్నారు.

"ఇతర సినిమాలతో పోలిస్తే 'ది గర్ల్‌ఫ్రెండ్' షూటింగ్ అనుభవం ఎలా ఉంది?" అని మరో నెటిజన్ అడగ్గా, ఆ సినిమా తనను మానసికంగా చాలా అలసిపోయేలా చేసిందని రష్మిక వెల్లడించారు. "సాధారణంగా మనం మర్చిపోవాలనుకునే ఎన్నో లోతైన, నిజమైన భావోద్వేగాలను ఈ సినిమా కోసం మళ్లీ గుర్తుచేసుకోవాల్సి వచ్చింది. ఆ అనుభవాలను మళ్లీ జీవించడం నాకు చాలా కష్టంగా అనిపించింది" అని ఎమోషనల్ అయ్యారు. ఈ విషయం గురించి దర్శకుడు రాహుల్ రవీంద్రన్‌ను అడిగితే చెబుతారని కూడా ఆమె పేర్కొన్నారు. రాహుల్ రవీంద్రన్ రచన, దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రానికి హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా నవంబర్ 7న థియేటర్లలోకి వచ్చే అవకాశం ఉంది.

## చిత్రీకరణ పూర్తి అయిన
# 'పిఠాపురంలో'



తొలి చిత్రం 'ప్రేయసి రావే'తోనే దర్శకునిగా తన సత్తా చాటుకున్నారు మహేష్ చంద్ర అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఆయన రూపొందించిన చిత్రం 'పిఠాపురంలో'. 'అలా మొదల్కొంది' అనేది ఉపశీర్షిక. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్య తారాగణంగా ఈ చిత్రం రూపొందింది. మహేష్ చంద్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళి నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు మహేష్‌చంద్ర మాట్లాడుతూ 'కుటుంబ భావోద్వేగాలు కల గలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు చూడొచ్చు. ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదో ఒకరకంగా ఈ కథతో కనెక్ట్ అవుతారు. ఈమధ్య కాలంలో 'పిఠాపురం' అనేది ఎంతలా మారుమోగిందో అందరికీ తెలిసిందే. ఆ పిఠాపురం నేపథ్యంలోనే సినిమా అంతా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 28 రోజులు, హైదరాబాద్‌లో 15 రోజులు, గోవాలో 6 రోజులు చిత్రీకరణ జరిపాం. ఇందులో మొత్తం మూడు పాటలు ఉంటాయి. గోవాలో ఒక పాటను, హైదరాబాద్‌లో సెట్‌వేసి ఇంకో పాటను, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్‌లో మరో పాటను చిత్రీకరించాం. దర్శకునిగా నాకు జీవితాన్ని ప్రసాదించిన రామానాయుడు గారి స్ఫూర్తితో కథను నమ్మి, ఎక్కడా వేస్టేజ్ లేకుండా ఈ సినిమా తీశాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అని తెలిపారు.




## సంక్రాంతికి వస్తున్నా..
# ది రాజాసాబ్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ది రాజాసాబ్ ఒకటి. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ది హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఎప్పుడెప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందా అని అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఇక ప్రభాస్ సినిమా అంటే వాయిదా లేకుండా రిలీజ్ ఉండదు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ది రాజాసాబ్ కూడా అదే తరహాలో వరుస వాయిదాలు పడుతూ వస్తుంది. డిసెంబర్ 5 న అనుకున్న సినిమా మరోసారి వాయిదా పడి సంక్రాంతి బరిలో దిగింది. జనవరి 9 న ది రాజాసాబ్ రిలీజ్ కు సిద్ధమవుతుంది. ఇక గతకొన్నిరోజులుగా సంక్రాంతి నుంచి కూడా రాజాసాబ్ తప్పుకుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా రాజాసాబ్ వాయిదా రూమర్స్ ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఖండించాడు. కచ్చితంగా రాజుగారు సంక్రాంతికి వస్తున్నారని తెలిపారు. ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టనున్నట్లు.. డిసెంబర్ లో అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయనున్నట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి పుకార్లను నమ్మకుండా ఉండాలని అభిమానులను కోరాడు. ప్రసుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. మరి ఈ సినిమాతో ప్రభాస్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem, VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**